

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 274 • పేజీలు : 8 • బుధవారం 26 జూన్ 2024 • వెల : రూ. 5.00
Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati

- ఐదేళ్లలో కుప్పంను తీర్చిదిద్దుతా
- అభివృద్ధికి నమూనాగా మార్చేస్తా
- విమానాశ్రయం కూడా ఏర్పాటు చేస్తా
- కుప్పంలో రౌడీయిజం చేస్తే..అదే చివరి రోజు
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కప్పంలో ఇది తొలిపర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం
- రాబోయే ఐదేళ్లలో కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటాం..
- కుప్పంలో హంద్రీనీవా నీటితో చెరువులన్నీ నింపుతాం..
- కుప్పంకు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం
- గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను పరిశీ లించిన చంద్రబాబు







# కుప్పంపై బాబు హామీల వర్షం

## మరో జన్మంటూ ఉంటే కుప్పంలోనే జన్మిస్తా : చంద్రబాబు

చిత్తూరు,జూన్ 25 (ఆంధ్రపత్రిక): కుప్పం ప్రజలు ఎప్పుడూ తనపై నమ్మకం ఉంచారని, మరో జన్మంటూ ఉంటే కుప్పంలోనే జన్మిస్తానని సీఎం చంద్రబాబు అన్నారు. ఎవరైనా కుప్పంలో రౌడీయిజం చేస్తే.. అదే వారికి చివరిరోజు అవుతుందని హెచ్చరించారు. కేబినెట్లో 8మందికి కొత్తవారికి అవకాశం కల్పించామని కుప్పం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సభలో చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తన సొంత నియోజకవర్గం కప్పంలో ఇది తొలి పర్యటన. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను పరిశీ లించారు. అనంతరం కుప్పం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. కుప్పంను అభివృద్ధికి నమూనాగా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నియోజకవర్గానికి ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా మిగతా 7లో

# భారత్ మరింత ప్రకాశించాలి



- వెంకయ్య నాయుడుతో ప్రధాని మోదీ భేటీ
- ఇరువురి మధ్య జాతీయ ప్రయోజనాలపై చర్చ

న్యూఢిల్లీ,జూన్ 25 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుతో సమావేశమయ్యారు. మంగళవారం ఢిల్లీలోని త్యాగరాజ్ మార్గ్‌లోని వెంకయ్య నాయుడు నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ జాతీయ మిగతా 7లో

# నేడు స్పీకర్ ఎన్నికకు ఓటింగ్

- ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి
- స్పీకర్ పదవికి పోటీని పెట్టిన కాంగ్రెస్
- ఓంబిర్లాకు పోటీగా కొడికున్నల్ సురేశ్ నామినేషన్





న్యూఢిల్లీ,జూన్ 25 : దేశ చరిత్రలో తొలిసారి స్పీకర్ ఎన్నికకు పోటీ జరుగుతోంది. అధికార ఎన్‌డిఎ ఏకపక్ష నిర్ణయానికి మిగతా 7లో

# నీట్ పరీక్షను రద్దుచేయాల్సిందే..

- మెడికల్ సీట్ల ఎంపిక స్వేచ్ఛ రాష్ట్రాలకే ఉండాలి
-ప్రధాని మోదీకి సీఎం మమతా బెనర్జీ లేఖ



న్యూఢిల్లీ,జూన్ 25 : నీట్ పరీక్షను పూర్తిగా రద్దుచేయాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోరారు. ప్రశ్నపత్రం లీకేజీపై మిగతా 7లో

# రాజ్యాంగ ప్రతులతో విపక్ష ఎంపిల ప్రమాణం

- దానినే పాటించిన రాహుల్, అఖిలేశ్ యాదవ్



న్యూఢిల్లీ,జూన్ 25 : 18వ లోక్‌సభ తొలి సమావేశాలు కొత్త పార్లమెంట్ భవనంలో విపక్షాల ఆందోళనల నడుమ కొనసా గుతున్నాయి. ఈ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు 280 మంది ఎంపీలు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీలతో మిగతా 7లో

# బిజెపిలోకి పెద్దిరెడ్డి..?



అమరావతి,జూన్ 25 (ఆంధ్రపత్రిక): బిజెపి కేంద్ర పెద్దలతో మంతనాలు జరుగుతున్న మిథున్ రెడ్డి, తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కూటమి పార్టీలు, మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి వర్గం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బిజెపిలోకి తీసుకురావడానికి విశ్వ ప్రయ త్నాలు చేస్తున్న సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి,జివిఎల్ మిగతా 7లో

## కాలువల శివారు ప్రతి ఎకరానికి

# నీరందాలి..

- రైతాంగానికి మేలు జరిగేలా అత్యవసర చర్యలు
- పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టండి
- ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి,జూన్ 25 (ఆంధ్రపత్రిక): రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంట కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరు అందేలా అధికారులంతా క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రస్తుత మిగతా 7లో



## 15 రోజుల్లోగా వివరణ

# కావాలి



- ఎపి సీఎస్ నీరబ్‌కుమార్‌కు ఎస్టీ కమిషన్ నోటీసులు
- పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్‌పై వివరణ ఇవ్వండి

అమరావతి,జూన్ 25 (ఆంధ్రపత్రిక): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రస్తుత ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ మిగతా 7లో

## శాసనసభ వ్యవహారాలపై అవగాహన

# అవసరం..

- జనసేన ఎమ్మెల్యేలతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ
- వారాహి అమ్మవారి దీక్షలో డిప్యూటీ సీఎం పవన్



విజయవాడ,జూన్ 25 (ఆంధ్రపత్రిక):జనసేన ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్తో పాటు ఆ మిగతా 7లో



## త్వరలోనే మళ్లీ

# టెట్..

- నిరాశకు గురికావొద్దు..
- మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అందరికీ మంచి జరగాలి
- మంత్రి నారా లోకేశ్

7లో

## ప్రతిపక్ష హోదా

# ఇవ్వండి



- అప్పడే సభలో గళమెత్తే అవకాశం ఉంటుంది
- ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు
- స్పీకర్ అయ్యన్నకు జగన్ సంచలన లేఖ

అమరావతి,జూన్ 25 (ఆంధ్రపత్రిక): ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్ జగన్ మిగతా 7లో

# మరీ వాలంటీర్ల సంగతేంటి..?

- సర్కార్ అభిప్రాయం కోరిన ఏపీ హైకోర్టు..
- వాలంటీర్ల వ్యవస్థ కొనసాగింపు విషయంలో ఉత్కంఠ
- హైకోర్టులో ప్రభుత్వం తన స్టాండ్ చెప్పక తప్పని పరిస్థితి
- ఎన్నికల పోలింగ్ ముందు లక్షమంది వాలంటీర్లు రాజీనామాలు



అమరావతి, జూన్ 25 (ఆంధ్రపత్రిక): ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థ కొనసాగింపు విష యంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎన్నికలకు ముందు వాలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని, వారికి జీతాలను కూడా రెట్టింపు చేస్తామని మిగతా 7లో

## కష్టపడిన వారికే

# న్యాయం

- నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి
- అర్హులకు పదవులు కట్టబెట్టే యోచనలో టిడిపి
- త్వరలోనే మొదలు కానున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ

అమరావతి,జూన్ 25 (ఆంధ్రపత్రిక): ముఖ్యమంత్రి చంద్రబాబు నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టారు. పార్టీకోసం పనిచేసిన వారు కూడా పదవుల కోసం ఎదురు మిగతా 7లో

## పరీక్ష నిర్వహణలో కేంద్రం

# విఫలం..

- ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్ రెడ్డి షెడ్యూల్
- నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జి విచారణకు డిమాండ్
- అధికారికంగా కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్ పోచారం
- మంత్రివర్గ విస్తరణలో పోచారంకు స్థానం ఉందంటూ ప్రచారం




న్యూఢిల్లీ,జూన్ 25 : ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ కాంగ్రెస్ పెద్దలతో పాటు, కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ వాటి కోసం మంత్రులను అర్థిస్తున్నారు. ఈ క్రమంలో నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరిపించాలని మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# ఇద్దరూ ఏం చేస్తారో?

ఆ మధ్య ఇద్దరు వ్యాపార సామ్రాజ్య సార్వభౌములు కలిశారు.ఇద్దరూ కలిసి వాటాలు పంచుకున్నారు.ఓ ప్రాజెక్టు విషయంలో మొదలైన ఈ భాగస్వామ్య బంధం ముందు ముందు ఎలా సాగుతుందో అనే ఉత్కంఠ వ్యాపార ప్రపంచంలో మొదలైంది.ముఖ్యంగా, మనదేశంలో ఈ అనూహ్య పరిణామం పెద్ద వార్తగా మొదలై, చర్చల పరంపరను సృష్టిస్తోంది. నేడు కలిసిన ఆ ఇద్దరూ నిన్నటి వరకూ వ్యాపార ప్రత్యర్థులు. నెంబర్ :1 స్థానం కోసం నువ్వా? నేనా? అని పోటీపడినవారు.ఇప్పుడు మొదలైన ఈ బంధంతో కలిసి వ్యాపారం చేయనున్నారు. ఆ ఇద్దరూ అంబానీ –ఆదానీ. ఓ పవర్ ప్రాజెక్టు విషయంలో వీరిద్దరి మధ్య భాగస్వామ్యం కుదిరింది. మధ్యప్రదేశ్ లోని అదానీకి చెందిన మహాన్ ఎనర్జన్ లిమిటెడ్ లో రిలయన్స్ 5కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. దీని ద్వారా అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ 26 శాతం వాటా దక్కించుకుంది. 500మెగావాట్ల విద్యుత్ ను తమ సొంత అవసరాలకు రిలయన్స్ వినియోగించుకోనుంది. ఈ ఇద్దరు దిగ్గజాలు ఎన్నో ఏళ్ళుగా వేర్వేరు వ్యాపారాల్లో కొనసా గుతున్నప్పటికీ, అగ్రస్థానాన్ని అధిరోహించడం కోసం ఎవరి శైలిలో వారు పోటీపడుతున్నారు.ఆయిల్, గ్యాస్, రిటైల్,టెలికాం విభాగాలలో ముఖేష్ అంబానీ విజయపరంపరతో ముందుకు వెళ్తున్నారు. ఇన్ఫ్రా, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మైనింగ్ వ్యాపారాలలో అదానీ అఖండంగా సాగుతున్నారు. మీడియా, పునరుత్పాదాక ఇంధన రంగాలలో ఇద్దరూ పోటీపడుతున్నారు. ఆసియాలోని సంపన్నులలో అందరి కంటే అగ్ర భాగాన నిలవాలన్నది ఇద్దరి సంకల్పం.ఇప్పుడు ఈ ప్రాజెక్టుతో ఇద్దరికీ వియ్యం కుదిరినా, కయ్యం ఉండదని చెప్పలేం.వీరి వియ్యాలు –కయ్యాలు ఎలా ఉన్నా, వీరి వల్ల మనదేశానికి ఏదైనా మేలు జరిగితేనే జాతికి నిజమైన ప్రయోజనం. భారత్ ను నెంబర్ :1 గా నిలబెట్టడం కోసం వీరిద్దరూ కలిసి ప్రయత్నిస్తే అందరూ హర్షిస్తారు. ఇద్దరూ గుజరాతీలే. ఇద్దరిదీ ఒకటే సామాజిక వర్గం దిల్లీ పెద్దల ఆశీస్సులు ఇద్దరికీ పుష్కలంగానే వుంటాయి. కాకపోతే, నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రధాని మోదీ ఆశీస్సులు అదానీకే ఎక్కువ ఉన్నాయనే ప్రచారం బలంగానే వుంది.ఈ పదేళ్ల బిజెపి పాలనలో ఆదానీ అందనంత ఎత్తుకు ఎదిగిపోయారన్నది వాస్తవం. ప్రస్తుతం ఆయన ప్రపంచంలోనే 15వ అత్యంత సంపన్నుడుగా నిలుస్తున్నాడు.అంబానీల వలె ఈయనది కూడా దాదాపు ఒకే రకమైన నేపథ్యం.చిన్న వ్యాపార వాతావరణం నుంచే వచ్చారు. 2014 నుంచి 2023 వరకూ బండి బాగానే నడిచింది కానీ, హిండెన్ బర్గ్ రిపోర్ట్ వ్యవహారంతో వివాదాల్లోకి వెళ్లారు.ఈ అంశంలో సుమారు 30శాతం సంపదను ఆయన కోల్పోయారని వార్తలు వచ్చాయి.ఈ అంశం మన పార్లమెంట్ ను కుదిపేసింది. ప్రతిపక్షాలు అధికార పార్టీని నిలదీయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాయి.ఆదానీకి అన్నిరకాలుగా అండగా నిలిచి,అభివృద్ధి చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నానాయాగీ చేసింది. రిలయన్స్ కు ఒకప్పుడు అధికారంలో వున్న కాంగ్రెస్ పెద్ద అండగా నిలిచిందనే పుకార్లు వున్నాయి.మొత్తంగా చూస్తే రిలయన్స్,అదానీ సంస్థలకు ఏలినవారి అండదండలు మెండుగా వున్నాయని, ఈ నేపథ్యంలో, సంప్రదాయ వ్యాపార సంస్థలుగా ఎన్నో ఏళ్ళ పాటు ఎంతో ప్రతిష్ఠను సొంతం చేసుకున్న టాటా, బిర్లా గ్రూపులు ఈ రేసులో వెనుకబడిపోయాయని ఎందరో అనుకున్నారు.ముఖేష్ అంబానీ కంటే గౌతమ్ అదానీ సుమారు 5ఏళ్ళు చిన్నవారు.ఎం.బి.ఏ., చదువుతూ,వ్యాపారం కోసం, అంబానీ చదువు మధ్యలో వదిలేశారు.బి.కామ్ చదువుతూ అదానీ రెండో సంవత్సరం తర్వాత చదువు మానేశాడు. చదువుల సంగతి ఎట్లా వున్నా, ఇద్దరూ వ్యాపారంలో బాగా రాణించారు, ఇంకా రాణిస్తూనే వున్నారు. “వ్యాపారంలోనూ,రాజకీయాలలోనూ శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు “ అంటారు.వీరిద్దరి మధ్య మిత్రత్వమే వికసించి వికాస భారతానికి మూలస్థంభాలుగా నిలవాలని ఆకాంక్షిద్దాం. భారతదేశానికి ఏమాత్రం అప్రతిష్ఠ రాకుండా ఆర్థిక సామ్రాజ్యాలు నిర్మించాలని, దేశ ప్రజకు వీరిరువురి కార్యకలాపాలు ఎంతో ఉపయోగపడాలని ఆశిద్దాం. ఎన్నికల తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం మళ్ళీ వచ్చినా, నిన్నటి వరకూ వున్నంత బలం బిజెపికి లేదు, ప్రధాని నరేంద్రమోదీకి లేదు. మరోపక్క విపక్ష ఇండియా కూటమి బలం గణనీయంగా పెరిగింది. మన్ మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా వున్న సమయంలో రిలయన్స్ కు కాంగ్రెస్ ప్రభుత్వం,అధినేత్రి సోనియాగాంధీ పెద్దఎత్తున సహకారం అందించారనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. ఇప్పుడు వీరిద్దరికీ ఈ పక్షాల సహకారం,సంపదసృష్టి ఎలా ఉండబోతాయో?

## విద్యాబోధన ‘వృత్తి’, సాహిత్యసేవ ‘ప్రవృత్తి’

# కోవెల సంపత్కుమారాచార్య



తండ్రి వద్దనే వైష్ణవాగమనాలు నేర్చుకున్నారు. 13 ఏళ్ల వయసులో కవిత్వం రాయటం ప్రారంభించారు. 16 ఏళ్ల వయస్సులో భాషాప్రవీణలో చేరారు. 30 ఏళ్లకే తెలుగు సాహిత్యంలో యం.ఏ. పట్టా అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి మొట్టమొదటి పి.హెచ్.డి. అందుకున్నారు. 30 ఏళ్లకు పైగా అధ్యాపకునిగా కొనసాగి వేలాదిమంది భావిభారత పౌరులకు మార్గదర్శకులయ్యారు. 30కి పైగా అపురూప గ్రంథాలను రచించారు. సాహిత్యసేవకే తన జీవితాన్ని అంకితం చేశారు కోవెల సంపత్కుమారాచార్య.కోవెల సంపత్కుమారాచార్య 1933 జూన్ 26న జన్మించారు. వరంగల్ పట్టణమే వీరి జన్మస్థలం. తల్లి చూడమ్మ, తండ్రి రంగాచార్యులు. వీరు గొప్ప పండితులు. సంపత్కుమారాచార్య అక్షరాభ్యాసం మొదలు ప్రాథమికోన్నత విద్య వరకు వరంగల్లులోనే జరిగింది. తల్లి చూడమ్మ వద్ద రామాయణ, భారత, భాగవతాలు నేర్చుకుంటూ తండ్రి రంగాచార్యుల వద్ద వైష్ణవాగమనాలు నేర్చుకున్నారు. ఆ కాలంలోనే వరం గల్లులోని సంస్కృత పాఠశాలలో చేరి సంస్కృతం నేర్చుకున్నారు. తెలుగు, సంస్కృత భాషలపై పట్టు సంపాదించాలనే అభిలాష పెరిగింది. కృష్ణా జిల్లా ముఖ్య పట్టణమైన మచిలీపట్నంకు సమీపంలో ‘చిట్టి గూడూరు’ అనే గ్రామంలో నారసింహ సంస్కృత కళాశాలలో చేరి 1953 నాటికి భాషాప్రవీణ పూర్తి చేశారు. సంపత్కుమారాచార్య వరంగల్లులోని సంస్కృత పాఠశాలలో చదువుతున్న నాటికి అక్కడి పరిస్థితులు సజావుగా లేవు. రజాకార్ల అల్లర్లు, ఆగడాలు, వేధింపులు అధికంగా ఉండేవి. రంగాచార్యుల సనాతన కుటుంబం అక్కడ నెగ్గుకు రావటం కష్టమైంది. దినమొక యుగంగా గడవటం అలవాటయింది. సంపత్కుమారాచార్య అన్న లక్ష్మీ నరసింహాచార్యులకు సుప్రసన్నాచార్య అనే కొడుకుండే వాడు. సంపత్కుమారాచార్య, సుప్రసన్నాచార్య లిద్దరిదీ ఒకే వయసు. ఇద్దరూ కలిసి చదువుకునే వారు, కలిసి మెలిసి తిరిగేవారు. ఒకవైపు కుటుంబం రజాకార్ల అలజడికి ఆందోళన చెందుతుంటే, వీరిద్దరూ ఏకాంతంగా కూర్చుని అక్షరాలూ పేర్చుకుంటూ, పదాలు అల్లుకుంటూ పద్యాలు రాయటానికి కుస్తీలు పడేవారు. అలా వందల పద్యాలు రాశారట. అప్పటికి సంపత్కుమారాచార్య వయసు 13 ఏళ్ళు మాత్రమే. అలా మొదలైన వారి కవితా ప్రవాహం ముందు ముందు కాలంలో ఉధృతమై కొనసాగింది. ఆ దశలోనే సంపత్కుమారాచార్య చిట్టి గూడూరు వెళ్ళటం, భాషాప్రవీణ పూర్తి చేయటం జరిగింది. సంపత్కుమారాచార్య చిట్టి గూడూరులో విద్య నభ్యసిస్తున్న కాలంలో వరంగల్లులో పరిస్థితులు విషమించాయి. సనాతన వంశమైన ఆ కుటుంబం వరంగల్లులో నెట్టుకురావటం కష్టమైంది. రంగాచార్యుల పెద్ద కొడుకు లక్ష్మీ నరసింహాచార్యులు సూచనల మేరకు కుటుంబాన్ని గుంటూరు జిల్లాకు తరలించారు. రేపల్లెకు సమీపంలోని ‘నల్లూరిపాలెం’కు చేరి అక్కడో చిన్న పాఠశాలను ప్రారంభించి అక్కడి విద్యార్థులిచ్చే దానితో కుటుంబ పోషణ కొనసాగించేవారు. సంపత్కుమారాచార్య భాషాప్రవీణ పూర్తి చేయటం, ఆయన కూడా అక్కడకే చేరటం జరిగింది. అన్న లక్ష్మీ నరసింహాచార్యులు నడుపుతున్న పాఠశాల విద్యార్థులకు హిందీ పాఠాలు చెప్పేవారు. 1962 నాటికి వారి కష్టాలు గట్టెక్కాయి. వరంగల్లులోని మల్టీ పర్పస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. ఉపాధ్యాయునిగా కొనసాగుతూనే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు సాహిత్యంలో యం.ఏ. డిగ్రీ అందుకున్నారు. ప్రయివేటుగానే హిందీ యం.ఏ. పరీక్ష రాసి 1966 నాటికి పట్టా అందుకున్నారు. అక్కడితో వారిలోని విద్యా తృష్ణ ముగియలేదు. “ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ–సంప్రదాయ రీతి” అనే పరిశోధనా పత్రం సమర్పించి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి. పట్టా అందుకున్నారు. ఆ విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి. అందుకున్న తొలి విద్యార్థిగా సంపత్కుమారాచార్య చరిత్రలో నిలిచారు. అటు తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతిగా నియమితులై సుదీర్ఘకాలం కొనసాగి విద్యార్థులను తీర్చిదిద్దారు. 1993లో ఆచార్యునిగా పదవీవిరమణ చేసిన సంపత్కుమారాచార్య తన జీవితాన్ని సాహిత్య కృషికి వెచ్చించారు. పదవీవిరమణ అనంతరమే వారిలో కవితాఝురి ప్రవహించిందనుకుంటే పొరపాటు. చిట్టి గూడూరు సాంస్కృతిక కళాశాలలో చేరక ముందే వారిలో అంకురించిన సాహితీ మొలక దినదిన ప్రవర్ధమానమై ఎదిగింది. 1951 ప్రాంతంలో విశ్వనాథ సత్యనారాయణతో పరిచయమైంది. అది దినదిన ప్రవర్ధమానమై, “వారి ప్రియ శిష్యుణ్ణి” అనే గర్వంగా చెప్పుకొనే స్థాయికి చేరింది. సంపత్కుమారాచార్య, సుప్రసన్నాచార్యులు కలిసి రాసిన “హృద్గీత” అనే పుస్తకం విశ్వనాథ సత్యనారాయణ పీఠికతో అచ్చవటం వారి మధ్య నున్న అనుబంధానికి చకక్టి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ 1960లో “తెలుగు ఛందోరీతులు” పేరున గ్రంథ రచన పోటీ నిర్వహించింది. ఆ పోటీలో ఆ గ్రంథానికి బహుమతి రాలేదు కాని, ఆ పుస్తక ముద్రణకు అకాడెమీ ఆర్థిక సాయం అందించింది. ఆ గ్రంథం తెలుగు సాహిత్యంలో మంచి గుర్తింపు పొందింది. 1954 నుంచే వారు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలు, విమర్శలు వివిధ పత్రికల్లో అచ్చవుతూ వారిని రచనా వ్యాసంగంలో ముందుకు నడిపించాయి. అస్వస్థతగా ఉన్నా కలం కదిలిస్తూనే ఉండేవారని వారి అనుయాయులు చెపుతారు.“ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ–సాంప్రదాయ రీతి” అనే పి.హెచ్.డి. గ్రంథమే కాక, సుప్రసన్నాచార్యతో కలిసి “హృద్గీత”, “ఆనందలహరి”, “అపర్ణ” లాంటి గ్రంథాలు, చేకూరి రామారావుతో కలిసి “వచన పద్యం–లక్షణ చర్చ” లాంటి అపురూప గ్రంథాన్ని రచించారు. “లక్షణ దీపిక” లాంటి సులభ వ్యాకరణ గ్రంథంతో పాటు “ఛందోవికాసము” “ఛందః పదకోశములు” “మధుర గాథలు”, “చేతనా వర్తనములు” (రెండు భాగాలు), “తెలుగు సాహిత్య చరిత్ర”, “పూర్వకవుల కావ్య దృక్పథాలు”, “అంతర్మథనము”, “తెలుగు ఛందస్సు పై కొన్ని వెలుగులు”, “కావ్యం–కవిస్వామ్యం”, “కిన్నెంసాని పాటలు–వస్తు విన్యాసం”, “కన్యాశుల్కం–మరోవైపు”, “చింతయంతి”, “ఛందాన భూమికలు”, “మన కవులు–పండితులు”, “చేరాకు ఒక శతమానం”, “విశ్వనాథ సాహిత్య దర్శనం” లాంటి గ్రంథాలు అందించిన సంపత్కుమారాచార్య “కాలస్పృహ” అనే ఖండకావ్యం, “ఆంజనేయనం” అనే శతకం, “కల్హణ” అనే అనువాద గ్రంథం, “సుకవి మనోరంజనం”, “లక్షణ సార సంగ్రహము”, “రంగనాథ రామాయణము” లాంటి పరిష్కార గ్రంథాలతో సంతృప్తి చెందక “ఏకశిలా సాహిత్య సౌందర్యము”, “పోతన భాగవత నీరాజనం” లాంటి వాటికి సంపాదకత్వం కూడా వహించిన కోవెల సంపత్కుమారాచార్య 2010 ఆగస్టు 5న స్వర్గస్తులయ్యారు.

**దాసరి ఆళ్వారస్వామి**

# క్షమాగుణం మనోశాంతికి వరం

ప్రకృతి మనిషికి ఇచ్చిన గొప్ప వరం క్షమాగుణం.జీవకోటిలో మానవునికి వున్న గొప్ప లక్షణం క్ష్మమా గుణం కలిగి ఉండటం వల్ల మానసిక ఆరోగ్యానికి మనోశాంతికి ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం 26జూన్ రోజున అమెరికాలో క్షమాపణ దినోత్సవం జరుపుకుంటారు.క్రిస్టియన్ ఎంబసీ అంబాసిడర్స్ 1994 సం” నుండి ఈ రోజునుజరపడంప్రారంభించారు.ఇతర వ్యక్తుల పట్ల మనకున్న కోపం’ పగ ‘ఆగ్రహం కక్షలు గతములో చేసిన తప్పులను క్షమించడం మీధ అవగాహన చైతన్యంకలిగించే కార్యక్రమాలు చేపడుతారు. కోపం వల్ల మానసిక ఆరోగ్య మీద కలిగే ప్రభావం పర్యవసానం గురించి అవగాహన కలిగించడం ద్వారా క్షమా గుణం ప్రాధాన్యతను సమాజములో విస్తరించడం జరుగుతుంది. క్షమగుణం పైసమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన చైతన్యం కలిగిస్తారు .క్షమా గుణం రక్షణ కవచంక్షమా గుణం ప్రతికూల భావాల నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి రక్షణ కవచంగాసహాయపడుతుంది. క్షమాపణ మీకు అన్యాయం చేసిన వారి పట్ల కోపం పగ చెడు ఆలోచనను విడిచిపెట్టెట్లు చేస్తుంది. అవతలి వ్యక్తిని క్షమిచడం కాదు మిమ్మల్నివెనకకునెట్టేవేసే ప్రతికూల భావోద్వేగాల నుండి మిమ్మల్ని మీరు విడుదల చేసుకోవడం అని ప్రముఖ సైక్రయాటిస్ట్ ల అభిప్రాయం. క్షమా గుణం అంతర్గత మానసిక ప్రశాంతతక్షమాపణ ఇతరుల పట్ల అవగాహన తాదాత్మ్యకతను పెంపొందించుకోవడానికి సంకేతంలాగ పనిచేస్తుంది. మనిషిలో అంతర్గత శాంతి స్థాపనకు మానసిక ప్రశాంతత స్థిరత్వానికి సహాయ పడుతుంది.క్షమాపణ వల్ల కలిగే ప్రయోజనాలుఒత్తిడిని తగ్గిస్తుంది మానవునికి కోపం ఆగ్రహం ఏర్పడితే దీర్ఘకాలిక మానసిక ఒత్తిడికి దారితీస్తుంది. తలనొప్పి కండరాల ఒత్తిడి ఏకాగ్రతకుబంగంకలుగుతుందిక్షమాపణ మనకు హాని కలిగించే ప్రతికూల భావోద్వేగాలనుండిరక్షిస్తుంది.ఒత్తిడినితగ్గించడంలో సహాయపడుతుంది.మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్షమాపణ కోపం’ ఆగ్రహం ‘చెడు ఆలోచనను తగించుకోవడనికి మానసిక స్థితినిమెరుగుపరుచుకోవడనికి పాజిటివ్ ఆలోచనలు పెంపొందిస్తుంది. మెరుగైన ప్రజా సంబంధాలకు క్షమాపణ వారధిగా నిలుస్తుంది.నిద్రను మెరుగు పరుస్తుంది మనం తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనప్పుడు నిధ్రపోవడం కష్టం. క్షమాపణ మన మనసును మరియు శరీరాన్ని శాంత పరచడానికి ఉపయోగ పడి విశ్రాంతి ‘మనోశాంతి మన వశమౌతుంది .నిద్ర వ్యవస్థను మెరుగుపరుస్తుంది.సంతోషం సంతృప్తి పెరుగుతుంది మనం జీవితంలో ఎవరినైనా క్షమిస్తే మనలో కలిగే ప్రతికూల భావాలను భావోద్వేగాలను అదుపులో ఉంచుకునే అవకాశాలు మెరుగు పడతాయి. పాజిటివ్ దృక్పథం ఏర్పడుతుంది. సానుకూల అంశాల పై దృష్టి పెట్టే అవకాశం కలుగుతుంది. మనలో శక్తి సామర్థ్యాలు పెరిగి ఉత్పాదక సామర్థ్యం పెరిగి జీవన ప్రమాణాలు పెరుగుతాయి . సంకల్ప బలం’ ఆనందం ‘సంతోషం ‘ సంతృప్తి కలుగుతుంది.సంబంధాలు మెరుగు పడతాయిలి పరిశ్రమల్లో సేవారంగల్లో పనిచేసే ఉద్యోగ సిబ్బంది చేసిన పొరపాట్లను సవరించడం నూతన ప్రణాళికలను అమలు చేయడంలో జరిగే తప్పిదాలను గుర్తిస్తూ క్షమించడం వల్ల యాజమాన్యం సిబ్బంది మధ్య సత్ సంబంధాలు ఏర్పడతాయి. మెరుగైన యాజమాన్య సంబంధాల వల్ల ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుంది. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులు ఇతర వ్యక్తులతో ఆరోగ్యకరమైన సంబంధాలు పెంపొందించు కోవడానికి దోహదపడుతుంది. పరస్పర విశ్వాసం ‘నమ్మకం పునర్జీవింప చేయవచ్చు. అవగాహన ఆత్మీయత పెరుగుతుంది.ఆత్మ గౌరవం మెరుగైన సామాజిక విలువలు క్షమా గుణం కలిగి ఉండటం వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడతారు. వ్యక్తిత్వ వికాసం కలిగి వ్యక్తి సంపూర్ణ మూర్తివత్వాన్ని కలిగి వుంటాడు. స్వయం రక్షణ ‘ స్వయం కరుణ’ దయ పైదృష్టి పెట్టడం వల్ల వ్యక్తుల ఆత్మగౌ రవం పెరిగి సామాజిక మానవీయ విలువలు ఇనుమడిస్థాయి. సమాజంలో హింసాత్మక ధోరణులు తగ్గుతాయి. హింసా రహిత సమాజాన్ని స్థాపించవచ్చును.సమాజంలో శాంతి ‘సహనం ‘ సామరస్యం’ సంఘీభావం’ పరస్పర సహకారం సమరసత ఏర్పడి మెరుగైన సమాజ నిర్మాణం సిద్ధిస్తుంది.



**నేదునూరి కనకయ్య**

# మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట అనివార్యం

ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సహకారాన్ని, చర్యలను బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది 26 జూన్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 7, 1987న చేసిన తీర్మానం 42/112 ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడిసి) ఈ రోజున మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి ఏటా జూన్26న ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను స్వాధీన పర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది.మాదకద్రవ్యాలు మానసికస్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలా భిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకుముందు ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలను వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిని ఎండార్ఫిన్స్ అంటారు. ‘మత్తు’ ఉంటేనే ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి. అవి దొరకని సమయంలో వారు నీరసంగా కనిపిస్తారు.కుటుంబ విలువలు విచ్ఛిన్నం కావడం, కుతూహలం, పిచ్చెక్కిస్తున్న పోటీ, భావోద్వేగ సమస్యలు, నిత్య జీవిత సమస్యల ఒత్తిడులు, చేతిలో డబ్బు బాగా ఆడడం యువకులలో, పెద్దలలో, వృత్తి నిపుణులలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండడానికి మరికొన్ని కారణాలు.మహిళలు చాలా మంది కోక్కు అలవాటు పడిపోతున్నారు. దానిని ఒకసారి వాసన చూస్తే ఆకలి నశిస్తుంది. చాలా గంటల పాటు శక్తివంతంగా వుండేటట్లుగా చేస్తుంది.



మహిళలు అనేక సమస్యల నుంచి తప్పించు కోవడానికి కూడా ఒక మార్గంగా మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. మాదక ద్రవ్యాల మీద ఆధారపడటం వల్ల జీవ రసాయనికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతినడం, మందులలోని రసాయనిక పదార్థాలు నాడీ వ్యవస్థ మీద దాడి చేయడం, తీవ్రమైన ప్రవర్తనలు, కాలక్రమంలో ఆత్మీయులతో సంబంధాలు విచ్ఛిన్నం కావడం జరుగుతాయి. భారతదేశంలో కొకైన్పై వ్యసనపడుతున్న వారి సంఖ్య రానురానూ పెరుగుతోందని అధికారులు నిర్ధారిస్తున్నారు. వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం, 2020లో 275 మిలియన్ల మంది డ్రగ్స్ వాడారు. 36 మిలియన్ల మంది డ్రగ్స్ వినియోగ రుగ్మతలతో బాధపడుతున్నారు. డ్రగ్స్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి మరియు భవిష్యత్తును దొంగిలిస్తున్నాయి, డ్రగ్స్ వాడకం మాత్రమే 2019లో దాదాపు అర మిలియన్ల మందిని చంపింది. గంజాయి చౌకగా దొరకడంతో చాలా మంది దీనికి బానిసలవుతున్నారు. మహారాష్ట్రకు చెందినవారే ఎక్కువగా ఈ పంట సాగుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనులకు మాయ మాటలు చెప్పి వారి భూములను తక్కువధరకు కౌలుకు తీసుకుని అందులో నిషేధిత గంజాయి పండించి దొడ్డిదారిన రూ. లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రసాయనిక పరమైన మందులతో భారతదేశానికి వచ్చి గంజాయి లాంటి వాటిని తిరిగి తీసుకు వెళ్లే విదేశీ పర్యాటకుల నుంచి వీటికి ఎక్కువ గిరా కీ లభిస్తోంది.25 శాతం మంది శారీరక సమస్యలకు గురవుతారు. 42 శాతం ఒత్తిడికి, మానసిక సమస్యలతో బాధపడతారు. 25 శాతం మంది భార్యల నుండి విడాకులు కోరుతున్నారు. 40 శాతం నేరపూరిత ఆలోచనలతో గడుపుతున్నారు. యువత 45 శాతానికి పైగా సెక్స్ లో విఫలమ వుతున్నారు. 24 శాతం మంది స్థూలకాయం లాంటి సమస్యలతో బాధ పడుతుంటారు. మద్యం మత్తులోనే 90 శాతం నేరాలు. ఘోరాలు జరుగుతున్నాయి. మాదక ద్రవ్యాలు నల్ల బజారులో అందుబాటులో ఉంటున్నాయి. వివిధ ప్రాంతాలలో సంకేత నామాలతో చెలామణిలో ఉన్నాయి, నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్ఎస్డీ ఇందులో ముఖ్యమైనవి. వీటిని కొందరు అక్రమ వ్యాపారాలతో దొంగ రవాణాకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను గడిస్తుంటే, యువత వానిని వినియోగిస్తూ చెడిపోతున్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారు. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికైనా వారు వెనుకాడరు.మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్స్టెన్సస్ చట్టాన్ని చేసింది. ఈ మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు. మాదక ద్రవ్యాల వినియో గానికి దీనికి తల్లి తండ్రులు, డాక్టర్లు, సమాజం, మీడియా కూడా సహకారం అందించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

# ఇచ్చిన హామీలను అమలు చేసే దమ్మున్న నాయకుడు చంద్రబాబు

### నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



**వేపాడ, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దమ్మున్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడేనని శృంగవరపుకోట నియోజకవర్గం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు.అదేవిధంగా తొలి కేబినెట్ లోనే హామీల అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం లక్కవరపుకోట మండల కేంద్రంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలు ఫైల్స్‌పై తొలి ఐదు సంతకాలు చెయ్యడం జరిగింది. ఆ ఐదు సంతకాలను కేబినెట్ ఆమోదించిన సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి చూసిన ఎదురు చూపులకు ఫలితం దక్కిన శుభదినం 16,347 పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ, ప్రజా వ్యతిరేక చట్టం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు,ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా నెలకు పెన్షన్ 4000/- రూపాయలకు పెంపు,నిరుపేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల పునః ప్రారంభం,నైపుణ్య గణనపై ఐదవ సంతకం చేసి యువత భవితకు బంగారు బాటలు వేశారన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత అధికంగా ఉన్నా గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం వారిని తీవ్ర నిరాశకు గురి చేసిందని తెలిపారు.ఈ నేపథ్యంలో తొలి సంతకం మెగా డీఎస్సీపై చెయ్యడం ద్వారా నిరుద్యోలందరికీ చంద్రబాబు ఊరట ఇచ్చారని ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని వెల్లడించారు. భూ యజమానుల్లో భయాందోళన కలిగించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కొరకు రెండో సంతకం చేశారని దీని ద్వారా రైతులే కాకుండా వివిధ కేటగిరీలకు చెందిన భూ యజమానులు అందరూ ఆనందపడుతున్నారన్నారు. వృద్ధాప్య,వితంతువు,దివ్యాంగుల సామాజిక పెన్షన్లను పెంచూతున్నట్లు ప్రకటిస్తూ ఆ దస్త్రంపై చంద్రబాబు మూడో సంతకం చేశారని దాని పట్ల చంద్రబాబు నాయుడు గారిని అవ్వాతాతలు ఇంటికి పెద్దకొడుకుల చూస్తున్నారన్నారు.అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది వైసీపీ ప్రభుత్వం 2019లో ఎత్తి వేసింది తిరిగి పునః ప్రారంభిస్తూ నాలుగో సంతకం చేశారన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలంటే వారు ఎమి చదువు కున్నారో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారు ఎంత మంది ఉన్నారో వివరాలు సేకరించి అందుకనుగుణంగా అడుగులు వేయాలన్న తలంపుతో చంద్రబాబు ఐదో సంతకాన్ని స్కిల్ గణంక ఫైల్‌పై పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్. కోట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి,క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకట రత్నాజీ, విశాఖ పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, విశాఖ పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి విర్రోతు శివాజీ, గొంప దుర్గా ఉమేష్, కొట్టాన విజయ్ కుమార్, యేడువాక గణేష్, గొంప చిన్నా బాబు,గొంప పోతునాయుడు, కోళ్ల రాము నాయుడు, ఎర్నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో జోరుగా ఉపాధి
# హామీ పనులు

**మునగపాక, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్ మునగపాక ఉపాధి కార్యాలయంలో సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద నిరుపేద కుటుంబాలు ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు పనులు కల్పించాలని ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు తప్పనిసరిగా ఇవ్వాలని సుస్థిరమైన ఆస్తులు ఏర్పాటు చేసుకోవాలని ప్రతి గ్రామంలో కూడా సన్న చిన్న కారు రైతులకు పండ్లతోట మొక్కలు పెంపకం చేయించాలని ఐదు ఎకరాలు లోపు ఉన్న ప్రతి రైతుకు పండ్లతోటల మొక్కలు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు మనపాక మండలం లో ఉపాధి పనులు సక్రమంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఉపాధి సిబ్బందిని అభినందించారు ఈ కార్యక్రమంలో ఏపిడి మణికుమార్ ఏవో శ్రీనివాస్ జిల్లా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధి సిబ్బంది మునగపాక ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవిందా పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రంలో
# వరివిత్తనాలు పంపిణీ

### - పంపిణీ చేసిన సర్పంచ్ ఎంపీటీసీలు



**వేపాడ, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**మండలంలోని సోంపురం గ్రామంలో గల రైతుభరోసా కేంద్రంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు,ఎంపీటీసీ సభ్యులు ఆకుల సత్యనారాయణ తదితరుల చేతుల మీదుగా ఖరీఫ్ వరి సాగుకు సంబంధించి రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. వ్యవసాయ అధికారుల ఇండెంట్ మేరకు రైతుల కోరినట్లుగా 1121,7029,1318,5204 రకాలకు చెందిన వరి విత్తనాలను భూమి విస్తీర్ణాన్ని బట్టి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్,ఎంపీటీసీలు మాట్లడుతూ వాతావరణం అనుకూలించిన వెంటనే ఖరీఫ్ వరి పంట సాగుకు రైతులు సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. అలాగే మండల వ్యవసాయ శాఖాధికారులు,రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అధిక దిగుబడులకు సంబంధించి సకాలంలో రైతులకు తగు సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

# ఆదర్శణీయులు అక్కడి ఉపాధ్యాయులు

### 70మంది విద్యార్థులకు రూ.11వేల 600ల విలువగల నోట్ బుక్స్ పంపిణీ
### టీచర్ల ఉదారత పట్ల హర్షం వ్యక్తం చేసిన దబ్బిరాజుపేట గ్రామస్తులు



**వేపాడ, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**నిజానికి బడిపంతుళ్ళు అంటే బ్రతక నేర్చిన వారన్న సామెత పూర్వకాలం నుంచి ఉంది.అయితే కాలక్రమేణా బడిపంతుళ్ళు అంటే బ్రతక నేర్చిన వారు అన్న అర్థం వచ్చేలా వారి వ్యవహార శైలిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.ఇదిలా ఉంటే మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల తీరు మిగిలిన టీచర్ల అందరికీ భిన్నమని చెప్పాలి.సాధారణంగా ఖర్చు పెట్టేందుకు వెనుకాడే టీచర్లలో ఉదార గుణం ఉన్నవారు కూడా ఉంటారని నిరూపించారు అక్కడి ఉపాధ్యాయులు.ఈ పాఠశాలలో 70మంది విద్యార్థులు చదువుతుండగా అదే స్కూల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఆర్.శంకరరావు, జి.నరసింహ మూర్తి, ఎం.సన్యాసయ్య, ఎ.జనార్ధనరావు,తాడి రాంబాబు తదితరులు రూ 11వేల 600లను ఆర్థిక సహాయంతో 70మంది విద్యార్థులకు నోట్ బుక్స్ కొనుగోలు చేసి మంగళవారం పంపిణీ చేసి శభాష్ అనిపించుకున్నారు. టీచర్ల ఉదారత పట్ల గ్రామస్థుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

# రాత్రీ, పగలూ విద్యుత్ కోతలు

### నరకం అనుభవిస్తున్న ఆర్.ఎస్ పేట గ్రామస్తులు
### అడిగితేనే విద్యుత్ సరఫరా పునరుద్దరణ
### గ్రామస్తుల ఆవేదనను పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

**వేపాడ, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**వేసవి పోయి వర్షాకాలం వచ్చినా మండలంలోని రామస్వామి పేట గ్రామంలో విద్యుత్ కోతలు తప్పడం లేదు. విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారో తెలియడం లేదు గాని పగలూ,రాత్రీ అనకుండా ఎపుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుందడంతో గ్రామస్తులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు.అకారణంగా రోజులో ఏడెనిమిది సార్లు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న అధికారులు,గ్రామస్తులు అడిగితేనే విద్యుత్ సరఫరా పునరుద్దరణ చేయడం అక్కడి విద్యుత్ సిబ్బందికి అలవాటుగా మారి పోయింది. విద్యుత్ సరఫరా నిలిపి వేసిన ప్రతిసారి గ్రామస్తులు సిబ్బందికి ఫోన్ చేస్తేనే స్పందిస్తారు.కొంతసేపు పోయేక మళ్లీ అదే తంతు.సుమారు నెలరోజులుగా ఇదే తంతు కొనసాగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి నిరంతరం విద్యుత్ సరఫరా చేయకుంటే ఆందోళనకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## పాలసంస్థ పి.ఎస్.మల్లునాయుడు
# సేవలు ప్రశంసనీయం



**కె.కోటపాడు, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**పాల ఉత్పత్తిదారుల సంస్థను ప్రగతి పథంలో నడిపించడానికి పాటుపడ్డ ప్రతి ఒక్కరు స్ఫూర్తి దాతలు, అభినందనీయులని కింతాడ సర్పంచ్ ప్రతినిధి, ఉప-సర్పంచ్ బండారు ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని కింతాడ పంచాయతీ శివారు జోగన్నపాలెం పాలఉత్పత్తిదారుల సంస్థలో ఉద్యోగ విరమణ చెందిన వేతన కార్యదర్శి కుబిరెడ్డి మల్లునాయుడును సంస్థ అధ్యక్షుడు బండారు అప్పలనాయుడు ఆధ్వర్యంలో డెయిరీ అధికారులు, పాలకవర్గం సభ్యులు, పాడిరైతులు, గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గం కూడా పాల ఉత్పత్తిదారుల సంస్థను మరింత అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. వేతన కార్యదర్శిగా కుబిరెడ్డి మల్లునాయుడు మూడున్నర దశాబ్దాలుగా డెయిరీకి, పాడి రైతులకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, జడ్పిటిసి మాజీ సభ్యుడు కశిరెడ్డి అప్పలనాయుడు, మాజీ అధ్యక్షులు కూండ్రపు పోలిబాబు, పాడిరైతులు బండారు అప్పలనాయుడు, బండారు నారాయణ పాత్రుడు, గ్రామ పెద్ద కన్నూరు అప్పలనాయుడు తదితరులను ఘనంగా సత్కరించారు.అలాగే పాలసంస్థ సిబ్బంది కుబిరెడ్డి వెంకునాయుడు, బండారు నాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ మేనేజర్ జి.ఎస్.వి.అప్పారావు, సూపర్వైజర్ చొక్కాకుల చక్రధర రావు, వేతన కార్యదర్శులు బండారు గంగునాయుడు, బి.ఎస్.ఎన్.రాజు, గ్రామస్థులు బండారు వెంకటరమణ, కుబిరెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## సోంపురం, బొద్దాం గ్రామాల్లో
# నేను బడికి పోతా కార్యక్రమాలు



**వేపాడ,జూన్ 25 (ఆంధ్రపత్రిక):**మండలంలోని సోంపురం,బొద్దాం తదితర గ్రామాల్లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు లు,ఉపాధ్యాయులు మంగళవారం నేను బడికి పోతా,విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం గ్రామాల్లో గల ప్రజలకు విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు సిఆర్పిలు ప్రసాద్, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు
# స్టాపర్ బోర్డులు పంపిణీ




**అనకాపల్లి, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**జిల్లా పోలీసులకు రాంకో సిమెంట్స్ లిమిటెడ్ కంపెనీ, ఏ.ఎస్ పేట గ్రామం, కసింకోట మండలం, రాంకో కంపెనీ యాజమాన్యం సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.9 లక్షలు విలువైన 125 స్టాపర్ బోర్డులను రాంకో సిమెంట్స్ కంపెనీ ప్రతినిధులు జిల్లా ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో నేషనల్ హైవే, స్టేట్ హైవేలలో రోడ్డు ప్రమాదాలు తరచూ సంభవించే (బ్లాక్ స్పాట్స్) వద్ద స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని, అలాగే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయవచ్చని, కంపెనీ యాజమాన్యం ట్రాఫిక్ భద్రతను దృష్టిలో పెట్టుకుని జిల్లా పోలీసులకు అందజేయడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఐపీఎస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, రాంకో సిమెంట్స్ కంపెనీ ప్లాంట్ యూనిట్ హెడ్ పీ.వీర పాండ్యన్, అడ్మిన్ హెడ్ ఎం.కళాధర్ రావు మరియు హెచ్.ఆర్ ఎం.యువరాజు, అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైడపు నాయుడు, అనకాపల్లి రూరల్ సీఐ ధనుంజయరావు, కసింకోట ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, అనకాపల్లి రూరల్ ఎస్సై తేజేశ్వరరావులు పాల్గొన్నారు.

# వైసీపీ కార్యాలయం వద్ద కాపుల నిరసన



**అనకాపల్లి. జూన్ 25 (ఆంధ్రపత్రిక):** తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో కొత్తూరు నర్సింగరావుపేటలో ఆనాటి శాసనసభ్యులు పిలా గోవింద సత్యనారాయణ కాపు సామాజిక భవనానికి రెండు ఎకరాల భూమి కేటాయించారని బిసి సెల్ ఉపాధ్యక్షులు, 84వ వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ జిల్లా కార్యాలయం స్థలం కేటాయిస్తున్నామని ఆనాటి మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రకటన చేసిన వెంటనే కాపు సామాజిక నాయకులు కార్యకర్తలు ప్రజలు నిరసన తెలిపామని అన్నారు. అయినప్పటికీ మంత్రి అధికార దుర్వినియోగం చేస్తూ, టౌన్ ప్లానింగ్ అనుమతులు తీసుకోకుండా జీవీఎంసీ నిధులతో నిర్మాణాలు చేశారని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాపు సామాజిక నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని వైసీపీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వ హించమని మాదంశెట్టి నీలాబాబు ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేసి గత ప్రభుత్వంలో మంజూరు చేసిన కాపు సామాజిక భవనం నకు స్వాధీనం చేయాలని దీనికి నిధులు మంజూరు చేసిన జీవీఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. జీవీఎంసీ జోనల్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపై శాఖా పరంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సిరిసిపల్లి సన్యాసిరావు, మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, సిహెచ్ దుర్గాప్రసాద్, జనసేన నాయకులు ఈత గోపి జాజిమొగుల అప్పలరాజు, గొల్లవిల్లి రాజు, కరెడ్ల కుమార్,కసిరెడ్డి అప్పలకొండ, చూచుకొండ రమణ, కసిరెడ్డి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్ వద్ద సిపిఎం ధర్నా

**అనకాపల్లి,జూన్ 25 (ఆంధ్రపత్రిక):**విశాఖపట్నం నుండి విజయవాడ మీదగా వెళ్తున్న రైళ్లను తక్షణమే పునరుద్దరించి సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె. లోకనాథం మాట్లాడుతూ. పేద, మద్యతరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, వలస కార్మికులు ప్రతి రోజు వేలాది మంది ప్రయాణిస్తున్నారు. వీరికి అందుబాటులో వుండే రైల్వే సర్వీసులను రద్దు చేయడం వలన తీవ్రమైన ఆర్థిక భారంతో పాటు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. గతంలో సామాన్య ప్రజలు రైల్వే జనరల్ బోగీలలో ప్రయాణించేవారు. ఆ బోగీలను ప్రభుత్వం తగ్గించింది. తరువాత కాలంలో సాధారణమైన వారికి అందుబాటులో వుండే స్లీపర్ బోగీల సంఖ్య తగ్గించి ఎసి బోగీలను పెంచడం ద్వారా సామాన్యుల ప్రయాణ సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం దూరం చేసింది. తాజాగా ఆధునీకరణ పేరుతో విశాఖ నుండి విజయవాడ వెళ్ళే పాసింజర్ రైళ్లుతో పాటు సింహాద్రి, రత్నాచల్, ఉదయ్, మచిలీపట్నం, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌లను తరుచు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రవాణా వాహనాల కంటే రైల్వేలో అతి తక్కువ ఛార్జీలు వుండడంతో పేద, మద్యతరగతి వర్గాల వారు తమ ప్రయాణాలకు రైల్వేనే ఎంచుకుంటారు. అటువంటి రైళ్లును రద్దు చేయడం వల్ల రోజుకు 10వేల మందికి పైగా ప్రయాణికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడాల్సివస్తుంది. విశాఖ నుండి విజయవాడ సుదూర ప్రాంతాల్లో తిరిగే రైళ్లు రద్దు నిర్ణయం తీసుకోవడం ఏమాత్రం మంచిదికాదు. ఆధునీకరణ పనుల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలతో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన రైల్వే అధికారులు, ఇలా రైళ్లును నిలుపుదల చేయడమంటే ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజలను రైలు ప్రయాణం నుంచి దూరం చేయాలని చూస్తున్నారని అర్ధమౌతుంది. రైలు ప్రయాణం పట్ల ఆశక్తి తగ్గించి క్రమంగా రైళ్లును ప్రైవేటీకరించాలన్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల్లో భాగంగానే రైళ్లు రాకపోకలను రద్దు చేసినట్లు భావిస్తున్నాం. సాదారణ ప్రయాణికుల సాదక, బాధలను అర్ధం చేసుకొని అందుకు అనుగుణంగా రైళ్లును నడపాలి. అనకాపల్లి జిల్లా కేంద్రం అయిన తరువాత నిత్యం ప్రయాణీకుల రాకపోకలు పెరిగాయి. అనకాపల్లి కేంద్రంగా రోజుకు పదుల సంఖ్యలో రైళ్లు తిరుగుతున్నాయి. వీటితోపాటు ఎల్‌టిటి, వందేభారత్ రైళ్లుకు అనకాపల్లిలో హాల్ట్ లేకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ నుండి ముంబాయి వెళ్ళి వచ్చే ఎల్‌టిటికి, విశాఖ నుండి హైదరాబాద్ వెళ్ళి వచ్చే వందేభారత్‌కు అనకాపల్లిలో హాల్ట్ కల్పిస్తే విజయవాడ వెళ్ళే వారికి ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది.అలాగే రైళ్లు, రైల్వే స్టేషన్‌లో మౌళిక వసుతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ట్రైన్సుల్లో టాయిలెట్స్ మరీ అధ్వాన్నంగా వుంటున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేయకపోవడంతో టాయిలెట్స్ దుర్గంధ భరితంగా వుంటున్నాయి. కావున రద్దు చేసిన పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లును పునరుద్దరించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. విశాఖ నుండి బయలుదేరే ఎల్‌టిటి, వందేభారత్ రైళ్లుకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు వి.వి. శ్రీనివాసరావు, అల్లు రాజు, పెంటకోట శ్రీనివాసరావు,తెలయ్య బాబు,నాయణబాబు, రాజు తదితరులు ఆధ్వర్యంలో జరిగింది.





# యువతను వ్యవసాయ రంగం వైపు ఆకర్షించే యత్నం

**- వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మలిచేందుకు కసరత్తు..**

**- ఐసిఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. యుఎస్ గౌతమ్ వెల్లడి**

**రాజమహేంద్రవరం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** పెద్దఎత్తున యువతను వ్యవసాయ రంగం వైపు మళ్లేంచేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని అందించడానికి కసరత్తు చేస్తున్నట్లు ఐసి ఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.యుఎస్ గౌతమ్ చెప్పారు. ఇప్పటికే వచ్చిన ఆధునిక సాంకేతిక మార్పులతో లాభదాయకంగా వ్యవసాయ రంగం ఉండడంతో సాఫ్ట్ వేర్ నిపుణులు, గ్రాడుయేట్స్ కూడా వ్యవసాయ రంగంవైపు అడుగులు వేస్తున్నారని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి పరిధిగా గల కృషి విజ్ఞాన కేంద్రాలు (కెవికె) జోన్ 10వార్షిక జోనల్ సమీక్ష వర్క్ షాప్ స్థానిక సిటీఆర్ఐలో మంగళవారం ఉదయం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్ షాప్‌కి హాజరైన డా.గౌతమ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇంకా ఎక్కువ మంది యువతను వ్యవసాయ రంగంవైపు ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో 731కెవికె లు ఉన్నాయని, వీటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆధారం చేసుకుని వీటి ద్వారా ఎప్పటికప్పుడు నూతన పరిశోధనలు, మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, మేలైన వంగడాలు అందించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశంలోని మూడు జోన్స్ లో దాదాపు ఎనిమిది వేల హెక్టార్లలో ప్రయోగాత్మకంగా 300డ్రోన్స్ ఉపయోగించి పురుగుమందులు జల్లడం వంటి పనులకు సంబంధించి ప్రదర్శన ఇచ్చినట్లు డా.గౌతమ్ చెప్పారు. దీనివలన కార్మికుల చార్జీలు తగ్గడం, కాలం సద్వినియోగం అవ్వడం, మిగిలిన వ్యవసాయ ఖర్చులు కూడా తగ్గి మరింత లాభదాయకంగా వ్యవసాయం ఉంటుందని తద్వారా యువత ఈ రంగంవైపు ఆకర్షితులవుతారని ఆయన అన్నారు. 10వేల బయో రిసోర్స్ యూనిట్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొందరికి పొలం ఉంటుందని, మరికొందరికి పశువులు ఉంటాయని, మరికొందరికి ఫిషరీస్, ఇంకొందరికి కోళ్ల ఫారాలు ఉంటాయని, వీటన్నింటినీ కలిపి నిర్వహించేవారు కూడా ఉంటారని డా.గౌతమ్ వివరిస్తూ, ఎక్కువ ఆదాయం పొందడానికి బహుముఖంగా అన్నింటినీ ఎలా సమకూర్చుకోవాలో కూడా కెవికె ద్వారా వివరించే ప్రయత్నం మరింత వేగవంతం చేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు పెరిగిన నేపథ్యంలో అదనపు కెవికె లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొత్తం మీద నాణ్యమైన ఉత్పత్తులు, ఎక్కువ దిగుబడితో పొందేలా చూడాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు.

గత ఏడాది సాధించిన విజయాలు, ఎదురైన సమస్యలు చర్చించి, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడానికి ఈ వార్షిక వర్క్ షాపు దోహదం చేస్తుందని డా.గౌతమ్ సూచించారు. ఐసి ఏఆర్-సిటిఆర్ఐ డైరెక్టర్ డా.ఎం.శేషుమాధవ్, ఐసి ఏఆర్ డైరెక్టర్ డా షేక్ ఎన్ మీరా సమావే శంలో పాల్గొన్నారు. ఐసి ఏఆర్-సిటిఆర్ఐ, ఐసిఏఆర్-అగ్రికల్చ రల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారీ) హైదరా బాద్, వైస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నాయి.



## ఎమ్మెల్యే వనమాడి జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్న వితరణ

**కాకినాడ, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు) జన్మదినం సందర్భంగా కాకినాడ ప్రతాప్ నగర్ సెంటర్లో ఉన్న జనావళి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారికి భోజన వితరణను నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని 41వ డివిజన్ టీడీపీ ఇన్చార్జ్ జొన్నాడ వెంకటరమణ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే వనమాడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంచి వారికి అన్నవితరణలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికలో ఎమ్మెల్యే వనమాడి పాత్ర కీలకమన్నారు. అప్పుడే నగరం అభివృద్ధి చెందిందని తిరిగి మళ్లీ అదే స్థాయిలో పుంజుకోవడం ఖాయమని వీరు చెప్పారు. డాక్టర్ కొండమూరి సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ చాలా ప్రశాంతత నగరం అని అటువంటిది ఈ మధ్యకాలంలో అలజడులు జరిగాయన్నారు. తిరిగి ప్రశాంత వాతావరణం వస్తుందని డాక్టర్ కొండమూరి చెప్పారు. 41వ డివిజన్ ఇంచార్జ్ జొన్నాడ వెంకటరమణ మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు ఎమ్మెల్యే కొండబాబు జన్మదినం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జొన్నాడ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిందాడ సూరిబాబు, ఎస్ సుబ్రహ్మణ్యం, పులపకూర శ్రీనివాస్, గుత్తుల భారతి, తోరేటి సత్యవతి, పెంకే లోవ కుమారి, ఎం.కోటేశ్వరరావు, సత్యనారాయణ, ఆంజనేయులు, కొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టివిటిజి గ్రామాలను ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తా

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్**

**అనంతగిరి.జూన్ 25 (ఆంధ్రపత్రిక):** ప్రధానమంత్రి జన్మన్ పథకంలో పివిటిజి గ్రామాలకు అన్ని వసతులు,మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి .అభిషేక్ స్పష్టం చేశారు. మంగళవారం చిలకల గెడ్డ పంచాయతీ మెట్టపల్లి గ్రామం సందర్శించారు. పివిటిజి గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేస్తామని,. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. విద్యుత్ సదుపాయం లేని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి 20 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తూ గ్రామ సభ తీర్మానం చేసి భూమిని అప్పగించాలని చెప్పారు. అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ పథకాన్ని వర్తింప చేస్తామన్నారు. గిరిజనులు మేకలను మంజూరు చేయాలని కోరుతున్నారని ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు లేని వారికి బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేస్తామన్నారు. వంతెన నిర్మాణానికి, రహదారి పనులకు రివైజ్డ్ శాంక్షన్ ఆర్డర్లను తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి సంబంధిత శాఖలలో అమలు చేస్తున్న పథకాలను మెట్టపల్లి గ్రామానికి మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామంలో సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించింది లేనిది గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎస్ సహాయ ప్రాజెక్టు అధికారులు బిఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ ఈ ఈ బి.బాబు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్ బి ఎస్ నందు, ఐసిడిఎస్ పిఓ సంతోషి కుమారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## వార్డులో ఎటువంటి సమస్యలు ఉన్నా తక్షణమే తెలియజేయండి

**48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు**



**విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** వార్డులో ఎటువంటి సమస్యలు తలెత్తిన తక్షణమే తమకు తెలియజేయలని, జీవీఎంసీ 48వ వార్డు కార్పొరేటర్ బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు అన్నారు. ఉత్తర నియోజకవర్గం 48వ వార్డు పరిధిలో గల కొండ వాలు ప్రాంతం జై భారత్ నగర్, శ్రీనివాస్ నగర్, శివలింగపురం, న్యూ శ్రీనివాస్ నగర్, వార్డులో గంకల కవిత అప్పారావు మంగళ వారం నాడు సుడిగాలి పర్యటన చేసారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన పిర్యాదుల మేరకు జై భారత్ నగర్, శ్రీనివాస్ నగర్, శివలింగపురం, న్యూ శ్రీనివాస్ నగర్, వార్డు అంతటా గల పలు ప్రాంతంలో జరుగుతున్న నూతన రోడ్లు, కాలువలు, మెట్లు నిర్మాణ పనులను గంకల కవిత అప్పారావు నేరుగా సమీక్షా చేసి కార్మికులతో పనులను చేయించి గ్రామాలలో నూతన పనులు పరిశీలించి నాణ్యతను పరిశీలించి ఎటువంటి అంతరాయం లేకుండా త్వరిత్తగతిన పనులు జరపాలని, పలు చోట్ల పలు రోడ్లులు ఇరువైపులా, కాలువలు, డ్రైనేజీలను పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేయించారు. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహనా కల్పించారు. ఈ సందర్బంగా గంకల మాట్లాడుతూ, వార్డులో ప్రజలు పిర్యాదు మేరకు అభివృద్ధి పనులు చేయడం జరిగిందని,కొన్ని చోట్ల అభివృద్ధి పనులు పై పిర్యాదు అందిందని వాటి పై వెంటనే సమీక్షా జరిపి పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందని,నూతన అభివృద్ధి పనులు పరిశీలించి వాటి నాణ్యతను పరిశీలించి ఎటువంటి అంతరాయం లేకుండా త్వరిత్తగతిన పనులు జరపాలని కోరడమైనదని,వార్డులో పలు చోట్ల పారిశుధ్య కార్మికులతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందని,రానున్న వర్ష కాలం దృష్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసర ప్రాంతాలలో శుభ్రంగా ఉంచుకోవాలని,ఎటువంటి ఆరోగ్య సమస్య ఏర్పడిన తక్షణమే వార్డులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. పలు చోట్ల ఇబ్బందులు పై వచ్చిన పిర్యాదు మేరకు తక్షణమే సంబంధిత అధికారులతో సంప్రదించి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. డెంగ్యూ,మలేరియా వంటి సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలపడం జరిగిందని కొన్ని నేరుగా సమీక్షించి సమస్య నెరవేర్చడం జరిగిందని అన్నారు. వార్డ్ ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని అన్నారు. వార్డ్ ప్రజలు పిర్యాదు పట్ల తక్షణమే చర్యలు చేపట్టి శ్రమిస్తున్న వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు కృషి పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



## హయగ్రీవ డెవలపర్ సంస్థపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

**ఎండాడ సర్వేనెంబర్ 92/3లో నిర్మాణాన్ని నిలిపివేయాలి**

**12.50 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి**

**కలెక్టర్ మయూర్ అశోక్ కుమార్‌కు జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఫిర్యాదు**

**విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** విశాఖపట్నం ఎండాడ గ్రామం సర్వే నెం:92/3లో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ మయూర్ అశోక్ కుమార్‌కు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆ సంస్థ సకాలంలో అనదాశ్రమం, వయో వృద్ధాశ్రమం నిర్మించి వినియోగంలోకి తేవడంలో విఫలమై, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నందున ఆ భూమి ని స్వాధీనం చేసుకోవాలి. నిర్మాణ పనులు నిలిపివేసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. విశాఖపట్నం ఎండాడ సర్వే నంబర్ 92/3లో 12.50 ఎకరాల కొండ పోరంబోకు స్థలాన్ని 2008లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు నంబర్ 1447 తేది: 06-12-2008 ప్రకారం 10 శాతం స్థలంలో అనదాశ్రమం, వృద్ధాశ్రమం ఏర్పాటు, మిగతా 90 శాతంలో వయోవృద్ధులకు మాత్రమే గృహ నిర్మాణాలు చేసి విక్రయించే నిబంధనలతో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు 12.50 ఎకరాల కొండ పోరంబోకు స్థలాన్ని కేటాయించారు.నిర్ణయాత సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చెయ్యకుండా ఈ ప్రాజెక్టు ప్రయోజనాలను విస్మరించి 26 మంది ప్రయివేట్ వ్యక్తులకు 32 000 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసియున్నారు. స్థల కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ రిజిస్ట్రేషన్లను రిజిస్ట్రేషన్ శాఖవారు గుర్తించి రద్దు చేసియున్నారు. భూమి క్రమబద్ధీకరణ, రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే వెయ్యి, రెండువేలు గజాలను ప్లాట్స్ రూపంలో విక్రయించి నారు. ప్రముఖ భవన నిర్మాణాల వ్యాపార వేత్త ఎంవివి.సత్యనారాయణ, జీవీ.వెంకటేశ్వర రావు, బ్రమ్మాజి అనే ముగ్గురు వ్యక్తులు అతనితో భవన నిర్మాణాల ఒప్పదం చేసుకుందామని ఖాళీ తెల్ల పేపర్స్‌పై సంతకాలు తీసుకోని మోసం చేసారని, ఇప్పుడు ఎవ్వరైతే ప్రభుత్వం నుండి అధికారంగా భూమిని తీసుకున్న జగదీశ్వరడు అనే వ్యక్తి తేది: 22-06-2024న విశాఖపట్నం ఆరిలోవ పోలీస్ స్టేషన్ (FIR.No:227/2024 నందు పిర్యాదు చేశారు. ప్రభు త్వం వద్ద స్వల్ప ఖరిదుకు భూమి పొందినప్పటి నుంచి నేటి వరకు ప్రాజెక్టు పనులు పూర్తి స్థాయిలో చెయ్యకుండా అక్రమ వ్యాపార లావాదేవీలు జరిపిన హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థ ప్రభుత్వం కేటాయించిన భూమిలో సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలం అయివున్నది. అనాథ, వృద్ధ ఆశ్రమాలు, వయోవృద్ధుల గృహ నిర్మాణాల ప్రాజెక్టును పక్కదోవ పట్టించడం, సుమారుగా రూ.500 కోట్ల విలువైన భూముల్లో అక్రమ ఆర్థిక భూ లావాదేవీలు జరపడం తదుపరి అంశాలు పరిగణనలోకి తీసుకుని హయగ్రీవ సంస్థ కు కేటాయించిన ఎండాడ సర్వే నెంబర్ 92/3లోని 12.50 ఎకరాల భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆ ఫిర్యాదుల పేర్కొన్నారు.

## నూతన విద్యుత్ లైన్ నిర్మాణం నిమిత్తం విద్యుత్తుకు అంతరాయం

**విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** వేపగుంట సెక్షన్‌లో పద్మనాభపురం 11 కేవీ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడినని, ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. 26న బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు క్రొత్త విద్యుత్ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం 33/11కేవీ సబ్‌స్టేషన్ పద్మనాభపురంలో, 11 కేవీ బంటాకాలనీ ఫీడర్‌పై విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కింది ప్రాంతాలైన బంటాకాల నీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయి నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును. ప్రజలు అధికారులతో సహకరించాలని ఆయన కోరారు.

## జూన్ 29 శనివారం జాతీయ లోక్ అదాలత్

**జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు ప్రత్యేక లోక్ అదాలత్ ..**

**- డిఎల్ఎస్ఎ కార్యదర్శి కే.ప్రకాష్ బాబు**



**రాజమహేంద్రవరం జూన్ 25(ఆంధ్రపత్రిక):** మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్ బాబు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్రెస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి కే .. ప్రకాష్ బాబు మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం తూర్పు గోదావరి జిల్లాలో ఈ దిగువ తెలుపబడినఅన్ని కోర్టుల యందు ది.29.06.2024న (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు మరియు ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరింపబడును. కావున కక్షిదారులందరు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకుని జిల్లా వ్యాప్తంగా జరుగు జాతీయ లోక్ అదాలత్ నకు ది. 29.06.2024న (శనివారం) ఉదయం 10 గంటల నుండి తమ యొక్క కేసులను ఆయా కోర్టుల నందు పరిష్కరించు కొనవలసినదిగా తెలియజేసారు. జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు సుప్రీం కోర్టులో పెండింగ్ కేసుల పై ప్రత్యేక లోక్ అదాలత్ గౌరవ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు ఆదేశానుసారం గౌరవ సుప్రీంకోర్టు నందు పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం గౌరవనీయమైన సుప్రీంకోర్టు వారు 29 జులై, 2024 నుండి 3 ఆగస్టు, 2024 వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఎ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు తెలియ చేశారు. ఉన్నత న్యాయస్థానం మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి మరియు కక్షిదారులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయని, సంబంధిత జిల్లా లేదా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు ఫిజికల్ / వర్చువల్ విధానంలో ముందస్తుగా లోక్ అదాలత్ సమావేశాలలో పాల్గొని కేసులలో రాజీ కుదుర్చుకొనుటకు కక్షిదారులకు వీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నందు కేసులను పరిష్కరించుకొనుటకు కక్షిదారులు కేసు వివరాలతో పాటు తమ సమ్మతిని ఇవ్వవచ్చునని తెలియ చేశారు. న్యాయవాదులు సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను మరియు పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్‌కు పంపవచ్చునని, మరిన్ని వివరాల కోసం కక్షిదారులు లేదా వారి న్యాయవాదులు టోల్ ఫ్రీ నెం. 15100 కు లేదా వారి సమీప కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని ప్రకాష్ బాబు తెలిపారు. కావున కక్షిదారులందరు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకుని గౌరవ ఉన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) నందు నిర్వహించబడే ప్రత్యేక లోక్ అదాలత్ నందు 29 జులై, 2024 నుండి 3 ఆగస్టు, 2024 తమ యొక్క కేసులను పరిష్కరించు కొనవలసినదిగా విలేఖరుల సమావేశంలో తెలియ జేయడమైనది.

# రైతు పురోభివృద్ధి దిశగా కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేయాలి

**వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సదస్సులో డా.యూ.ఎస్. గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఐసిఏఆర్, న్యూ ఢిల్లీ..**



**రాజమహేంద్రవరం, జూన్ 25(ఆంధ్రపత్రిక):** రైతు పురోభివృద్ధి దిశగా కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేయాలనీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఐసిఏఆర్, న్యూ ఢిల్లీ.. డా.యూ.ఎస్. గౌతమ్ పేర్కొన్నారు.వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సదస్సును మంగళవారం స్థానిక భారత వ్యవసాయ పరిశోధనా మండలి కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ, రాజమండ్రి వేదికగా వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ జోన్ x కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.యూ.ఎస్. గౌతమ్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని వాణిజ్య పరంగా చూడగలిగిన రైతు ఆదాయంలో స్థిరత్వం వస్తుందని వివరించారు. జూన్ 25 నుండి 27 వరకు నిర్వహింప బడుతున్నాయని ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలియచేసారు. ఈ సదస్సును అటారి జోన్ x హైదరాబాద్, ఐసిఏ ఆర్‌సిటిఆర్ఐ మరియు డా.వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వారు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. డా.షేక్ యెన్ మీరా, డైరెక్టర్, అటారి, హైదరాబాద్, డా.నీరజ ప్రభాకర్, వైస్ ఛాన్సలర్, కొండా లక్ష్మయ్య తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ, హైదరాబాద్, డా.టి,జానకి రామ్, వైస్ చాన్సలర్, డా.వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం, డా.కె.సురేష్, డైరెక్టర్, ఐసి ఏఆర్‌హెచ్‌ఓపిఆర్ పెదవేగి గౌరవ అతిధులుగా హాజరైనారు. వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ జోన్ xతో అనుబంధంగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళ్ నాడు మరియు పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించి 72 కృషి విజ్ఞాన కేంద్రాల అధిపతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వేదికను అలంకరించిన ముఖ్య విశిష్ట అతిధుల ద్వారా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ఈ సదస్సు ప్రారంభించబడింది. డా.మాగంటి శేషు మాధవ్, డైరెక్టర్, మాట్లాడుతూ ఐసిఏఆర్, సిటిఆర్ఐ ఆధ్వర్యంలో రెండు కేవీకేలు రైతు సేవలో పనిచేస్తున్నాయని తెలిపాడు. డా, షేక్ యెన్ మీరా, డైరెక్టర్ అటారి జోన్ x మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల సమీక్షా సమావేశాలు రాజమ హేంద్ర వరంలోని సిటిఆర్ఐలో జరుపుకోవడం చాలా హర్ష దాయకమని, ప్రతీ కృషి విజ్ఞాన కేంద్రం పోటీ తత్వంతో పనిచేయాలని, రైతులకు వ్యవసాయం, ఉద్యాన పంటలు, పశు విజ్ఞానం, గృహ విజ్ఞానం తదితర అంశాలపై నిరంతర అవగాహన కల్పించడంలో ప్రధమ పాత్రను పోషిస్తున్నాయని తెలిపారు. డా. టి.జానకి రామ్, వైస్ ఛాన్సలర్, డాక్టర్ ఎస్ర వెంకటరా మన్నగూడెం మాట్లాడు తూ భారత దేశంలో కేవీకే లు రైతు అభివృద్ధికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు వరి, కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, పండ్లు మొదలైన పంటలపై వినూత్నమైన పరిశోధనలు జరుపుతూ, రైతుకు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. డా.నీరజ ప్రభాకర్, వైస్ ఛాన్సటర్, కొండా లక్ష్మయ్య తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మాట్లాడుతూ, తెలంగాణలో రైతు సాధికారత మరియు పురోభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రాలు చాలా దోహద పడుతున్నాయని తెలిపారు. డా.కె.సురేష్, డైరెక్టర్, ఐసిఏఆర్‌హెచ్‌ఓపి ఆర్ పెదవేగి మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ విభాగాల ద్వారా పరిశోధన ఫలితాలు రైతుకు నేరుగా అందించడంలో ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయని తెలిపారు. డా.మాగంటి శేషుమాధవ్, డైరెక్టర్, సిటిఆర్ఐ:డా.ఈ కరుణశ్రీ డైరెక్టర్ అఫ్ ఎక్స్టెన్షన్, డా.వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం సెంథిల్ వినాయగం, హైదరాబాద్, డా యెన్ లొగానందన్, హెడ్, కేవీకే, తుంకూర్, కర్ణాటక, డా.ఎం.వి. ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త, పెదవేగి, ఆంధ్ర ప్రదేశ్ డా.కె.వేలు మురుగన్, హెడ్, కేవీకే, నామక్కల్, తమిళనాడుబీ డా. ఏ భాస్కరన్, ప్రధాన శాస్త్రవేత్త, అటారి హైదరాబాద్: వక్తలుగా వ్యవహరించి కేవీకిలు రైతులు, రైతు మహిళలు, గ్రామీణ యువత మరియు గిరిజనులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణ మొదలైన పలు అంశాలపై వారి అభిప్రాయాలను ప్రెజెంటేషన్స్ ద్వారా విశదీకరించారు. ఈ సదస్సును పురస్కరించుకొని ముఖ్య అతిధిగా విచ్చేసిన డా.యూ.ఎస్. గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఐసిఏఆర్ న్యూ ఢిల్లీ మరియు విశిష్ట అతిధులను డైరెక్టర్లు ఘనంగా సన్మానిం చారు. డా. జె.వి.ప్రసాద్, ప్రధాన శాస్త్రవే త్త, ఆటారి హైదరాబాద్ ఈ ప్రారంభో త్సవ కార్యక్రమానికి ముఖ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డా.ఏ.భాస్కరన్, ప్రధాన శాస్త్రవేత్త, అటారి హైదరాబాద్ వారి వందన సమర్పణతో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసినది.



# తాళ్లూరు లిఫ్టు పరిశీలన

**పరిశీలించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**గోకవరం / గండేపల్లి జూన్ 25 (ఆంధ్రపత్రిక):**గండేపల్లి మండలం తాళ్లూరు పుష్కర కాల్వకు అనుసంధానంగా ఉన్న తాళ్లూరు లిఫ్టును ఇరిగేషన్ అధికారులు, వై.జగదీష్, సిహెచ్ రామలక్ష్మి పుష్కర నిర్మాణంలో భాగస్వామ్యులైన మెగా కంపెనీ పిఎం మురళి, రైతుల తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, తాళ్లూరు లిఫ్ట్ అధ్వానంగా తయారవ్వడానికి కారణం గత ప్రభుత్వమే అని గత కొన్ని సంవత్సరాలుగా దానిపై హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని దీనిపై ఎమ్మెల్యేగా పరిశీలించడానికి వచ్చానని తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న సిఎస్ పైపుల స్థానంలో ఎమ్మెస్ పైపులు వేసి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడానికి 49 కోట్లు అవసరం అవుతాయని కానీ ప్రభుత్వం ఇప్పుడే ఏర్పడడం నిధులు సమకూర్చడానికి ఇంకా టైం ఉండటంతో సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో నిధులు సమకూర్చుకుని పని పూర్తి చేస్తానని తెలియజేశారు. అప్పటివరకు రైతులు తమ బోర్లు, చెరువులు వర్షాధారం మీద పండించుకునే రైతులు తప్ప పుష్కర లిఫ్ట్ పై ఆధారపడి పంటలు వేసుకునేవారు దీనిపై ఆధారపడవద్దని తెలియజేశారు. అదేవిధంగా మురారి, సింగరంపాలెం, కే.గోపాలపురం, గండేపల్లి తదితర గ్రామాలలో నీరు అందించేందుకు 25 కోట్లతో గండేపల్లి వద్ద పుష్కరకు కొత్త లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మల్లవరం గోవిం దపురం గ్రామాలకు 139 కోట్ల రూపా యలతో నిధులు శాంక్షన్ చేయడం పనులు ప్రారంభిస్తే గత ప్రభుత్వం విస్మరించిందని, మళ్లీ మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తి చేయ డం జరుగుతుందన్నారు. అదేవి ధంగా నరేంద్ర పట్నం, మావిడాడ, ఇర్రిపాక గ్రామా ల్లో ఐదు కోట్లతో పురుషోత్తపట్నం ఎత్తి పోతల పథకం నుండి పైపులు ద్వారా నీరు అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్.వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, బి.రామకృష్ణ, సీతారామయ్య, వీరబాబు, వెంకటేశ్వరరావు, అప్పలరాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## స్పీకర్ "అయ్యన్నపాత్రుడు"కు "కొల్లి"
# అభినందనలు



**కె.కోటపాడు, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో నిబద్ధత కలిగిన నాయకుడుగా మన్ననలు పొందిన నర్సీపట్నం శాసన సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు శాసన సభాపతిగా ఎన్నికవడం ఆనందదాయకం అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు, రిథమ్ స్టూడియో అధినేత (హైదరాబాద్) కొల్లి రామకృష్ణ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడును కొల్లి రామకృష్ణ విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. జ్ఞాపికను బహుకరించారు. అసెంబ్లీ స్పీకర్ స్థాయికి సీనియర్ సభ్యులు అయ్యన్నపాత్రుడును ఎదగడం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వాసిగా తనకు ఎంతో గర్వకారణంగా ఉందని మండలంలోని రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు రామకృష్ణ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ను కలిసిన సందర్భంగా అన్నారు.

## పలు గ్రామాల్లో అమ్మవార్ల పండగల
# సందడి



**కె.కోటపాడు, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** ఈనెల27వ తేదీన మండలంలో పలు గ్రామాల్లో ఆయా గ్రామాల ఆరాధ్య దేవతలయిన అమ్మవార్ల పండగల ను ఘనంగా చేయడానికి ఆయా ఊళ్ల ప్రజల సహకారంతో నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో శ్రీ మరిడి అమ్మవారి, కొరువాడ గ్రామంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగను అలాగే రామయోగి అగ్రహారం (యడ్లవానిపాలెం, సిరికివా నిపాలెం, కొత్తఅగ్రహారం) గ్రామాల్లో శ్రీ మరిడమ్మ తల్లి అమ్మవార్ల పండగలను భక్తి శ్రద్దలతో వైభవంగా చేయనున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. పండగలకు అమ్మవార్ల అలయాలు ముస్తాబ వుతున్నాయి. ఈ పండగలకు బంధువులను, చుట్టాలను, స్నేహితులను, అతిధులను ఆయా గ్రామాల వారు ఆహ్వానిస్తున్నారు.

# అన్నదాతకు సాగునీరు అందించడమే లక్ష్యం

**గాదరాడ పుష్కర కాలువ పూడికతీత పనులు**

**తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ కాలువల్లో పూడికతీత**

**శ్రీరంగపట్నం బురద కాలువలో పూడికతీత పనులు**



**కోరుకొండ, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**రాజానగరం నియోజకవర్గంలో రైతులకు సక్రమంగా సాగునీరు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముందడుగు వేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు సాగునీటి పథకాలు, కాలువల్లో పూడిక తీత పనులు, ఇరిగేషన్ పథకాల్లో లోపాలు, నిర్వహణ, మరమ్మతులు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే బత్తుల సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు సక్రమంగా ముందుకు సాగాలంటే ముందుగా కాలువలు సాగునీరు పారెందుకు వీలుగా ఉండాలి. ఇప్పటికే కాలువల్లో భారీగా గుర్రపు డెక్క, తూటు పెరిగిపోవడంతో నీరు పొలాలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. దీంతో మంగళవారం నియోజకవర్గంలోని గాదరాడ పుష్కర కాలువ, రామచంద్రపురం-తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ కాలువ, సింగవరం కొండ నుండి మొదలై చినకొండేపూడి వెళ్ళే కాలువ, శ్రీరంగ పట్నం బురద కాలువల పూడిక తీత పనులను అధికారులు ప్రారంభించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయా ప్రాంతాల ఎన్‌డిఏ కూటమి నాయకులు పాల్గొన్నారు..



## అమ్మవారిపండగకు ఎమ్మెల్యే "బండారు"కు ఆహ్వానం

**కె.కోటపాడు, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**ఈనెల 27వ తేదీన తమ గ్రామంలో జరగనున్న గ్రామ దేవత శ్రీ మరిడమ్మ తల్లి పండగలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని మాడుగుల శాసన సభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని మండలంలోని కొరువాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆహ్వానించారు. ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి స్వగ్రామమైన పరవాడ మండలం వెన్నెలపాలెంలో మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా టీడీపీ నాయకులు కలిశారు. గురువారం కొరువాడ గ్రామంలో జరగనున్న అమ్మవారి పండగకు రావాలని ఆయనను ఆహ్వానించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తిని ఆహ్వానించిన వారిలో కొరువాడ సర్పంచ్ సింగంపల్లి నారాయణ మూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యులు చీపురుపల్లి రామారావు, అల్లు నాయుడుబాబు, నాయకుడు కె.రమణ తదితరులు ఉన్నారు.

# టీడీపి బూత్ యూనిట్ నాయకుల సమావేశం



**కూనవరం,జూన్ 25 (ఆంధ్రపత్రిక):** మండలం స్థానిక తెలుగుదేశం పార్టీ ఆఫీసు నందు అరకు పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షులు తోటకూర వెంకటేశ్వరరావు అధ్యక్షతన బూత్ యూనిట్ క్లస్టర్ ఇన్చార్జిలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎక్స్ ఎంపీపీ పోడియం అప్పారావు మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలియజేస్తూ మండలం నుండి 1500 ఓట్లు మెజార్టీ ఇచ్చిన బూత్ యూనిట్ మరియు గ్రామ శాఖ మరియు సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. రాబోయే రోజుల్లో మండలంలో ఉన్న 16 పంచాయతీలకు గాను 16 గెలుచుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మరియు అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను ఎవరైతే బూత్ ఇన్చార్జులుగా పని చేస్తున్నారో వారికి అవకాశం కల్పించాలని రేపు జూలై ఒకటో తేదీన ప్రియతమ నేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఏడు వేల రూపాయలు పెన్షన్ ఇస్తున్న శుభ సందర్భంగా ప్రతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బరపాటి ప్రకాష్ రావు మాట్లాడుతూ మండలంలోని టిడిపి జనసేన బిజెపి నాయకులు కలిసికట్టుగా పనిచేసిన మెజార్టీ తెచ్చుకోవడం జరిగిందని అలాగే పార్టీలో క్రమశిక్షణగా ప్రతి ఒక్క కార్యకర్త కలిగి ఉండాలని అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారిపై అధిష్టానికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమానికి యూనిట్ ఇన్చార్జ్ మోసం రాము వీరమళ్ళ సునీల్ చదలవాడ శివ దాసరి నాగేశ్వరరావు ఐటిడీపీ మీడియా కోఆర్డినేటర్ రసూల్ మరియు 25 బూత్ ఇన్చార్జిలు తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## 29న మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం



**కె.కోటపాడు, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**ఈనెల 29వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ బి.ఎస్.కె.ఎన్.పట్నాయక్ తెలిపారు. శనివారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సాధారణ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు(ఎం.పి.పి.)రెడ్డి జగన్ మోహన్ అధ్యక్షతన సమావేశం జరగనుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని జడ్పిటిసి(జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం)సభ్యులు, ఎంపీటీసీ(మండల ప్రాదేశిక నియోజకవర్గం)ల సభ్యులు, గ్రామ పంచాయతీల సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ పట్నాయక్ తెలిపారు.

## రోగులకు పాలు పండ్లు రొట్టెలు
# పంపిణీ

**విశ్వ హిందూ దర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు**



**గోకవరం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**ఆపదలో ఉన్న వారికీ సహాయ సహకారాలు అందించాలని, విశ్వ హిందూ దర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు కోరారు. స్థానిక ప్రభుత్వ హాస్పటల్ వద్ద రోగులకు, గర్భిణీలకు పళ్ళు, పాలు, రొట్టెలను మంగళవారం పంపిణి చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్నేలుగా సమాజ సేవ కార్యకమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి మంగళవారం గోకవరం ప్రభుత్వ హాస్పటల్‌లో రోగులకు, గర్భిణీలకు, పళ్ళు, పాలు, రొట్టెలు పంపిణి చేస్తున్నానని, అంతేకాకుండా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్ధిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగా సహాయ పడటం దేవుడు ఇచ్చిన వరం అని అన్నారు. ప్రతి వ్యక్తి కూడా ఆపదలో ఉన్న వారికోసం ఎంతో కొంత సహాయపడాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధరావు శర్మ, హాస్పటల్ సూపరింటెంట్ డాక్టర్ వనజ, జాజుల లక్ష్మి, గౌరిశెట్టి వరలక్ష్మి, పడాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మొదటి ప్రాధాన్యత వారికే ఇవ్వాలి

**ఆదివాసి జేఏసి రాష్ట్ర కార్యదర్శి కుంజా.అనిల్**




**కూనవరం,జూన్ 25 (ఆంధ్రపత్రిక):**రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో ఆశ్రమ,గురుకుల పాఠశాలల్లో ఏఎన్ఎం లను నియమించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణి మొదటి సంతకం ఏఎన్ఎం నియమకల పైల్ పైన పెట్టడం హర్షించదగ్గ విషయం.. అయితే ఇవే పాఠశాలల్లో గతంలో ఎంతోమంది ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేసి ప్రస్తుతం నిరు ద్యోగులుగా ఉన్నారు.కావున ఉద్యోగ నియామకల్లో మొదటి ప్రాధాన్యత వారికే కల్పించాలని, ఆదివాసి జేఏసి రాష్ట్ర కార్యదర్శి కుంజా.అనిల్ స్థానిక కోతలు గుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో స్కూలు కాలేజీల్లో 24 గంటలు పని చేస్తూ చాలీసారని జీత భత్యాలతో విద్యార్థులను కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ సమయానికి జీతాలు ఇచ్చిన ఇవ్వకపోయినా స్కూళ్లలోని విద్యార్థులతో పాటు ఉంటూ ఎన్నో ఏళ్లుగా పని చేసినటువంటి ఆరోగ్య కార్యకర్తలను గత వైసిపి ప్రభుత్వం అందరిని తొలగించడం విధితమే,అందుకు కారణంగా గత ఐదు సంవత్సరాల్లో ఐటీడీఏ పరిధిలో గల పాఠశాలల్లో ఎక్కువ ఆదివాసి విద్యార్థులు అనారోగ్యానికి గురై మరణించడం జరిగింది. ఈ ప్రభుత్వం కొత్తగా అధికారంలో వచ్చిన వెంటనే ప్రతి ఆశ్రమ గురుకుల పాఠశాలలో ఏఎన్ఎంలను నియమిస్తాం అనడం చాలా హర్షించదగ్గ విషయమని ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా.అనిల్ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. కావున ఏఎన్ఎంల నియమించే క్రమంలో మొదటి ప్రాధాన్యతగా ముందు నుండి పని చేసినటువంటి ఆరోగ్య కార్యకర్తలకు విద్యార్థులతో ఎలా ఉండాలనే అవగాహన వారికి ఉంటుంది.కావున వారినే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ చింతూరు డివిజన్ ఉపాధ్యక్షులు వేటకాని మల్లయ్య, గతంలో పనిచేసినటువంటి ఆరోగ్య కార్యకర్తలు చిచ్చడి. రాములమ్మ, ధర్మల. శాంతికుమారి, సోమిని.రాజేశ్వరి, కారం. రాములమ్మ, కణితి. శ్రీదేవి, సవలం. శుభశ్రీ, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

## గాదెలపాలెం గోపాలపురంలో
# సూర్యదేవుని గ్రామోత్సవం



**గోకవరం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**గోకవరం మండలం గాదెలపాలెం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి సభ్యులు గ్రామ సర్పంచ్ కమ్మిల అచ్చిబాబు, కుంచె శివాజీ, దేశాల చిట్టిబాబు, వాకలపూడి రమణ,పనసకాయల పండు, దుక్కర దత్తుడు, భజన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉషాపద్మిని ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆధ్యాంతము గ్రామస్తులందరూ విశేషంగా స్పందించి అడుగడుగునా స్వామివారికి భక్తిశ్రద్ధలతో నీరాజనాలు సమర్పించారు. అదేవిధంగా గోకవరం మండలం గోపాలపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి సభ్యులు గూడవల్లి సతీష్, కాసాని ఏడుకొండలు, వీరవల్లి సత్తిబాబు, తుపాకుల ఆనందరావు, వీరవల్లి రామకృష్ణ, చింతల వీరన్న, అన్నిక ప్రసాద్, తుపాకుల రాము, చింతల పండు, ఎస్కే బాబ్జి, తుపాకుల వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఉషా పద్మిని ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండుగల నిర్వహించారు. ఈసందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబు ఉపాధ్యక్షులు అక్షింతల రాజా మాట్లాడుతూ, ప్రతి హిందువు ప్రతిరోజు తప్పనిసరిగా సూర్యనమస్కారాలు చేసుకోవాలని సూర్య భగవానునికి ప్రీతికరమైన ఆదివారము రోజున మధ్య మాంసాలు విడిచిపెట్టాలని ఫలితంగా సూర్య అనుగ్రహంతో ఆరోగ్యాన్ని ఆయుష్షును వృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు, చింతల సుబ్బారావు, చింతల చిన్నకాపు, సుగ్రబోయిన సీతయ్య, వరుపుల నాగు, మాచేపల్లి వెంకటేశు, చింతల లక్ష్మి, దేశాల సూరిబాబు,దేశాల నాగార్జున, మాతంశెట్టి చిట్టిబాబు, కాండ్రేగుల కుమార్, వాకలపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర దర్శనానికి
# పోటెత్తిన భక్తులు



**అయినవిల్లి,జూన్ 25 (ఆంధ్రపత్రిక):**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీ సిద్ధి విఘ్నేశ్వర దర్శనానికి భక్తులు సంకటహర చతుర్థి సందర్భంగా అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి వచ్చినారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామికి అభిషేకం మరియు పూజలు నిర్వహించు కున్నారు. గణపతి హెూమము అనేకమంది భక్తులు చేయించుకున్నారు. రమణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత రాయుడు రమణమూర్తి పుట్టినరోజు సందర్భంగా స్వామివారి అన్నదాన నిమిత్తం విరాళంగా 50 వేల రూపాయలు చెక్కు ఇచ్చినారు వీరికి అర్చకులు వేదాచార్వచనం అందజేసి, శేష వస్త్రంతో సత్కరించి, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేసినారు. వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారి సత్యనారాయణమూర్తి మరియు ఆలయ ప్రధాన ప్రధాన అర్చకులు సురేష్ శర్మ ,సిబ్బంది అన్ని ఏర్పాటు చేసినారు.

# జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌పై గ్రామసభ సమావేశం



**అయినవిల్లి,జూన్ 25 (ఆంధ్రపత్రిక):**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లి పాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతి ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామసభ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో సర్పంచ్ బుచ్చిరాజు మాట్లాడుతూ పని దొరకని వారికి గ్రామ పంచాయతీ వద్ద పేరు నమోదు చేసుకుంటే పని కల్పించడం జరుగుతుందని మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేశారని దీనివలన రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపినారు. ఎంపీటీసీ సభ్యులు మరియు మండల ఉపాధ్యక్షులు అడపా వెంకట నాగభూషణం మాట్లాడుతూ కూలీలకు ప్రభుత్వం జాతీయ ఉపాధి పథకం ద్వారా వేతనం పెంచినారని, గ్రామంలోని జాబ్ కార్డు సంఖ్యను పెంచాలని దీని వలన ప్రతి ఒక్కరికి పని దొరుకుతుందని ,రైతులు కొబ్బరి చెట్లకు పల్లెలు కొట్టడం వలన ఫల సాయం పెరిగి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపినారు. డి .ఆర్ .పి ఎం.పుల్లయ్య మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం లో వీరవల్లి పాలెం గ్రామంలో 37 పనులు చేసినారని ,కొబ్బరి చెట్లకు పల్లాలు తీయడం, ప్లాంటేషన్ పనులు ,హౌసింగ్ పనులు చేసినారని ,2023 -24 సంవత్సరానికి వీరవల్లిపాలెం గ్రామంలో 26 లక్షల రూపాయల పనికి వేతనం ఇవ్వడం జరిగిందని, మొత్తం 240 జాబ్ కార్డులుకి పని కల్పించడం జరిగిందని, అదేవిధంగా వీరవల్లిపాలెం గ్రామంలో సామాజిక పెన్షన్లు సక్రమంగా పంపిణీ జరిగిందని, మండలంలో 21 గ్రామంలో మూడు పేజ్‌లుగా విభజించడం జరిగిందని, ప్రస్తు తం మొదటి పేజ్ లో 10 గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి వీ. కనకాల ఆధ్వర్యంలో మరియు అయినవిల్లి ఎంపీడీవో పర్యవేక్షణ చేస్తారని ,అదేవిధంగా 27- 7- 2024వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిధిలో అన్ని గ్రామాలలో జరిగిన సోషల్ ఆడిట్ నివేదికలు అయినవిల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు అధ్యక్షతన ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందని తెలిపినారు.ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎన్ఆర్జిఎస్ జేఈ కుమార్ దాస్, సోషల్ ఆడిటర్స్ ఎస్. రవికుమార్, పి.రామ్ చరణ్ ,సర్పంచ్ సలాది బుచ్చిరాజు, మండలం వైస్ ప్రెసిడెంట్ అడపా వెంకట్ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ళ రవి, డిఆర్‌పి పుల్లయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, రైతులు, గ్రామస్తులు,జాబ్ కార్డ్ హెూల్డర్స్ ,ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆకాంక్షల మేరకు సేవలందిద్దాం

## - రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి



**విజయవాడ , జూన్ 25, (ఆంధ్రపత్రిక) :** గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యం లోని నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించి.. రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనించేలా సమష్టిగా కృషిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు.ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. సంక్షేమం-అభివృద్ధి తారకమంత్రంగా తొలిరోజు నుంచి ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు 100 శాతం ప్రజలకు చేరువయ్యేలా చేయడం కోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వంలో భాగమైన వివిధ విభాగాలు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విధులను నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలను, పరిపాలన విధానాన్ని ఉద్యోగులందరూ ప్రత్యక్షంగా పరిశీలించారని గుర్తు చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రం దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలంటే ఉద్యోగుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఉద్యోగి సంతోషంగా విధులు నిర్వహించేలా,సంతృప్తికర స్థాయిలో ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. వివిధ విభాగాల ఉద్యోగ సంఘాల నాయకులు కూడా తమ తమ సంఘాల సమావేశాల్లో ఇదే విషయాన్ని అందరికీ తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రతి ఉద్యోగి భవిష్యత్తు తరాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అండగా నిలవాలన్నారు. ఒకవైపు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ మరోవైపు రాష్ట్రాన్ని సామాజికంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా ప్రగతి బాటలో పయనించేలా చేసి దేశంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు సమష్టి కృషి అవసరమని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంత్రి పార్థసారథిని కలిసిన వారిలో కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రమేష్ , కోశాధికారి వి. సతీష్, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి దిలీప్, శివలీల, నగర శాఖ అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రాజశేఖర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ పి. మధుసూదన రావు, వైస్ ప్రెసిడెంట్ కేసర్ గణేష్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు అక్కిరాజు, నాలుగవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, సహాధ్యక్షులు పి సాయిరాం తదితరులతోపాటు జేపీసీలో భాగమైన నాయకులు ఉన్నారు.

# అసెంబ్లీలో భాష భావం సక్రమంగా ఉండాలి

## ప్రవర్తనపై ఎమ్మెల్యేలకు జనసేన అవగాహన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**కోరుకొండ, జూన్ 25 (ఆంధ్రపత్రిక) :** అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రవర్తనపై జనసేన పార్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిందని, అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే సమయంలో భాష, భావం సక్రమంగా ఉండాలని సూచించినట్లు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలియజేశారు. పొత్తు ధర్మం ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎక్కడా ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నడవాలని సూచించినట్లు తెలిపారు.

గత శాసనసభలో ప్రవర్తించిన భాష మాదిరిగా కాకుండా మంచి ప్రవర్తనతో అసెంబ్లీలో వ్యవహరించాలని కోరినట్లు వివరించారు. 5 కోట్ల మంది ప్రజలు గమనిస్తుంటారని శాసనసభలో ఎమ్మెల్యేలు గౌరవం పెరిగే విధంగా ఉండాలన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల అభివృద్ధి కోసం చర్చించడం జరిగిందని, ప్రజల అవసరాలు ఇబ్బందులు గుర్తించడం కోసం అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ప్రాధాన్యత అవసరాలను పుష్కరించే విధంగా చర్యలు ఉండాలన్నారు. పొత్తు ధర్మంతో ముందుకు సాగాలని, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు సమన్వయంతో కలిసి ముందుకు సాగాలని సూచించినట్లు వివరించారు.

ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు మంచి సేవలు అందించాలని, కేంద్ర సహకారం కూడా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రజలు అర్థం చేసుకుంటారని వివరించినట్లు తెలియజేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని కుంటుపరిచిందని, ఎన్డీఏ ప్రభుత్వం నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుందామని తెలియజేశారన్నారు.

## వారాహి అమ్మవారి ఆరాధనతో

# దీక్షకు శ్రీకారం







**అమరావతి, జూన్ 25 (ఆంధ్రపత్రిక):**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి దీక్షకు మంగళవారం శ్రీకారం చుట్టారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉదయాన్నే వారాహి అమ్మవారి ఆరాధనతో దీక్ష ప్రారంభించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. సంధ్యాసమయంలోను వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 రోజులపాటు వారాహి దీక్షలో ఉంటారు.

**1వ తేదీ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటన :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జులై 1వ తేదీ నుంచి తన పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించ నున్నారు. అదే రోజు సాయంత్రం పిఠాపురంలో వారాహి సభ నిర్వహిస్తారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజక వర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేస్తారు. మూడు రోజులపాటు పిఠాపురంతోపాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కాకినాడ జిల్లా అధికారులు, పిఠాపురం నియోజకవర్గ అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించారు. 29వ తేదీన కొండగట్టుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 29వ తేదీన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్తారు. స్వామివారిని దర్శించుకొని పూజాదికాలు నిర్వహిస్తారు.

# జివిఎంసి లో స్టాప్ డయేరియాపై ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ



**విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్టాప్ డయేరియా పై ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసమని, కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ (డెవలప్మెంట్) కె.ఎస్.విశ్వనాథన్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో అతి సారవ్యాధి వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సిటీ ఆపరేషన్ సెంటర్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్ 24 X 7 పనిచేస్తుందని, మురుగు నీరు నీటి సరఫరాలో కలుషితమైనా, కాలువలు, గెడ్డలు పొంగిపొరలినా, మలేరియా, డయేరియా, డెంగ్యూ వ్యాధులు సోకినా వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 0891-2869109కు ప్రజలు ఫోన్ చేయవచ్చని తెలిపారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 కార్యక్రమం జులై 1 నుండి ఆగస్టు 31 వరకు రెండు నెలలు పాటు కొనసాగుతుందని తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయ ఏఎన్ఎం లతో ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారి తల్లి దండ్రులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలని, ప్రత్యేక పరిశుభ్రత పై అవగాహన, వ్యర్థాల సేకరణ, ప్రజా మరియు సామాజిక మరుగుదొడ్లు ప్రతిరోజు శుభ్రపరచ డం, ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు చేపట్టడం, సురక్షిత త్రాగునీరు సరఫరా, గెడ్డలు, కాలువలలో పూడికలు తొలగింపు, ఇంటింటికి అతిసార వ్యాధి, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగడం, పరిశుభ్రత కలిగి ఉండాలని, మొదలైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు డయేరి యా, మలేరియా, డెంగ్యూ వ్యాధులపై నివేదిక సమర్పించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ను కమీషనర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి అతిసారవ్యాధి కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని, అతిసార వ్యాధి వ్యాప్తి పై ప్రజల అవగహన కొరకు హోర్డింగు లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవిడి ఫణి రామ్ ను ఆదేశి ంచారు. నగరం లో గల ప్రజా మరియు సామాజిక మరు గు దొడ్లులో మౌలిక సదుపాయాలపై తనిఖీలు నిర్వహించాలని ప్రధా న వైద్యాధికారికి కమీషనరు ఆదేశించారు. ఈ కార్యక్రమ ంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీని వాసరావు, ఎస్. ఎస్.వర్మ, ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజ నీర్ కె.వి.ఎన్.రవి, బయాలజిస్ట్ సాంబమూర్తి, లు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్మూలనకై ట్రాక్టర్లు పంపిణీ



**దుంబ్రిగుడ జూన్ 25 (ఆంధ్రపత్రిక):** పంచాయితీల గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పరిశుద్యం నిర్మూలనకై స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం పంచాయితీలకు ట్రాక్టర్లను పంపిణీ చేస్తుందని స్థానిక మండలం ఎంపీపీ బీ. ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్. జానకమ్మ చెప్పారు. ఈ పథకంలో భాగంగా మండలంలోని గసభ, గుంటసీమ, కించుమండ ,పోతంగి పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లను మంగళ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎంపీడీవో జయ ఉమా ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ, జడ్పిటిసి పాల్గొని పంచాయతీ సర్పంచ్ లకు అప్పగించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పేరుకుపోవడం వల్ల పలు రకాల వ్యాధులు ప్రబలుతుండడంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద కార్పొరేషన్ పథకంలో భాగంగా పరిశుద్ధాన్ని తొలగించి డంపింగ్ యార్డులకు తరలించడానికి ఉచితంగా పంపిణీ చేసిందన్నారు. మండల వ్యాప్తంగా 18 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం మొదటి విడతలో నాలుగు పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయన్నారు. వీటిని నాలుగు పంచాయతీలే కాకుండా మిగిలిన పంచాయతీల్లో కూడా సర్దుకుని గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు కృషి చేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, గసభ సిపిఎం సర్పంచ్ పి సునీత,కీంచుమండ సర్పంచ్ హెచ్ బి చెల్లమ్మ, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, ఎంపిటిసి జమ్మ, ఇన్చార్జి ఈవోపీ ఆర్డీ విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జిల్లా డైరెక్టర్ ఎం శ్రీరాములు, వైసిపి నాయకులు బి. సింహాచలం, హెచ్ బి బాబూరావు, సర్పంచ్ వెంకటరావు, చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఓ అగ్ర కులస్తుడు భూమి కబ్జా చేశాడు న్యాయం చేయండి

## -ప్రజా సమస్యలు- పరిష్కారం వేదికలో భూమి కబ్జాపై ఓ దళితుడు వేడుకోలు



**హిందూపురం, జూన్ 25 ( ఆంధ్రపత్రిక ):** పరిగి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మొదటి రోజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా మొదటి ఫిర్యాదు అందినట్లు డిప్యూటీ తహసిల్దార్ లక్ష్మీనరసింహులు తెలిపారు. ఊటుకూరు గ్రామానికి చెందిన పి గంగాధరప్ప వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా చలామణి అవుతున్న హిందూపురం పట్టణానికి చెందిన జనార్దన్ రెడ్డిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడం జరిగింది. 1962లో ప్రభుత్వం డి పట్టా హనుమంతప్ప అలియాస్ హనుమప్పకు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 279-2ఏలో 5 ఎకరాల 10 సెంట్ల భూమిని ఇవ్వడం జరిగింది. అయితే హిందూపురం పట్టణానికి చెందిన అగ్ర కులస్తుడు వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా చలామణి అవుతున్న జనార్దన్ రెడ్డి తమ భూమిపై లోను ఇప్పిస్తానని నమ్మబలికి దళితులమైన తన తండ్రి హనుమంతప్ప, ఇద్దరు కుమారులను, ముగ్గురు కుమార్తెలను జనార్దన్ రెడ్డి కారులోనే మడకశిరకు తీసుకెళ్లి లోన్ కోసం మడకశిర సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సంతకాలు చేయాలని నమ్మించి 3-6-2023న నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలానికి చెందిన గంటాల కుసుమ కుమారి పేరుమీద తమకు తెలియకుండా పెండింగ్ రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందని, 2019లో తమ భూమిని వేరే వ్యక్తికి అగ్రిమెంట్ వేశామని చెప్పినప్పటికీ అది అంతా నేను చూసుకుంటానని జనార్దన్ రెడ్డి తమతో చెప్పి మడకశిరలో మా వద్ద సంతకాలు ఫోటోలు తీసుకోవడం జరిగిందన్నారు. రెండు మూడు రోజులకు లోన్ అమౌంట్ బ్యాంకులో వేస్తారని చెప్పి హిందూపురంలోని ప్రైవేట్ బ్యాంకు కరూర్ వైశ్యా బ్యాంకులో తమ తండ్రితో సహా 5మంది అకౌంట్లను జనార్దన్ రెడ్డి ఓపెన్ చేయించడం జరిగింది. ఆ తర్వాత ఆ అకౌంట్లకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకాలు, ఏటీఎం కార్డులు అన్నీ కూడా తన వద్దే ఉంచుకున్నడని ఇది జరిగిన 13 రోజులకే మా తండ్రి హనుమంతప్ప మరణించడం జరిగింది. మా తండ్రి చనిపోయిన తర్వాత నా చెల్లెలు అయినటువంటి సంజీవమ్మ, అంజినమ్మ, రత్నమ్మలకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున 3 లక్షలు చెక్కులు ఇవ్వడం జరిగింది. అదే చెక్కులను సదురు జనార్దన్ రెడ్డి మా చెల్లెల్లతో బ్యాంకులో 50,000 చొప్పున విత్డ్రా చేయించాడు. తరువాత తాను మాకు 5000, 10,000, 20,000 రెండు మూడుసార్లు ఇవ్వడం జరిగిందని నా చెల్లెలు చెప్పారు. 2024 మార్చి 18వ తేదీన ఊటుకూరు సచివాలయం నోటీస్ బోర్డులో మా భూమికి సంబంధించిన ఫామ్ 8ను అతికించడం జరిగింది. మాకు మేము అగ్రిమెంట్ చేయించిన జయమ్మకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం జరిగింది. ఆ తరువాత జయమ్మ మా 5మందికి కోర్టు నుంచి నోటీసులు పంపడం జరిగింది. ఆ నోటీసులు వచ్చేవరకు మాభూమిని జనార్దన్ రెడ్డి తనతో పాటు మడకశిరకు వచ్చిన గంటాల కుసుమ కుమారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్న విషయం తెలిసింది. ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లో 3-6-2023న నా తండ్రి అయిన హనుమంతప్పకు రూ. 7లక్షల 50 వేలు చొప్పున రెండు చెక్కులు మొత్తం రూ. 15 లక్షలు ఇచ్చినట్లు, అదేరోజు రూ. 10లక్షల 50 వేల రూపాయలు మాకు నగదు చేరినట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ లో నమోదు చేసి మాకు మోసం చేశాడు. ఈ విషయం తెలిసిపోయిందని జనార్దన్ రెడ్డి తెలుసుకొని మమ్మల్ని మేము అగ్రిమెంట్ చేసిచ్చిన జయమ్మ వద్ద మేము ఎలాంటి డబ్బు తీసుకోలేదని కలెక్టర్ ముందు, పోలీసుల ముందు, లాయర్ ముందు చెప్పాలని మమ్మల్ని భయపెట్టాడు. ప్రతి రోజు తన చెల్లెల్ల వద్దకు వెళ్లి జనార్దన్ రెడ్డికి అనుకూలంగా సాక్ష్యాలు చెప్పాలని అలా చెప్తే మీ డబ్బు మొత్తం మీకు ఇచ్చేస్తానని చెప్తున్నాడని అగ్ర కులస్తుడైన జనార్దన్ రెడ్డి చేతిలో దళితులమైన మేము మోసపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు సీఎం తెలుసు, మంత్రి పెద్దిరెడ్డి తెలుసు నేను చెప్తే ఏదైనా జరుగుతుందని మాతో నమ్మబలికి మాకు మోసం చేయడం జరిగిందని, అలాగే కుసుమ కుమారి వాళ్ళ అన్న కడప జిల్లాలో ఎమ్మెల్యే అని చెప్పి మీరు ఇలా చెప్పకపోతే కడప వాళ్ల చేతుల్లో చావడం ఖాయమని మమ్మల్ని జనార్దన్ రెడ్డి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. తన వద్ద నుంచి మొత్తం డబ్బు తీసుకున్నామని అధికారులు ముందు, పోలీసులు ముందు, లాయర్ ముందు కూడా చెప్పాలని మమ్మల్ని బెదిరిస్తున్నాడు. 19-6-2024న జనార్దన్ రెడ్డి మా గ్రామానికి కారు వేసుకుని వచ్చి తప్పుడు సాక్షాలు చెప్పాలని మమ్మల్ని బలవంతం చేసి నా తమ్ముడు శంకరప్పను కారులో తీసుకెళ్లడం కూడా జరిగింది. ఆ తర్వాత నా బామ్మర్ది శ్రీనివాసులతో కలిసి నా చెల్లెళ్ళు తన వద్ద నుంచి డబ్బు తీసుకున్నామని సాక్షాలు చెప్పాలని భయభ్రాంతులకు గురి చేస్తూ బలవంతం చేస్తున్నాడని వారి సోదరీమణులు చెప్పారన్నారు. ప్రతిరోజు జనార్దన్ రెడ్డి నా చెల్లెలు నా బామ్మర్ది ఇంటి వద్దకు వెళ్లి వారికి మాయమాటలు చెప్పి డబ్బు ఆశ చూపిస్తూ మభ్యపెడుతున్నాడని మేము జయమ్మ అనే వ్యక్తికి అగ్రిమెంట్ చేయించామని చెప్పినప్పటికీ, ఎవరు అడిగిన అదంతా అబద్ధమని చెప్పు అని తనతో చెప్పడం జరిగిందన్నాడు. దళిత కులానికి చెందిన నిరక్షరాశులయిన అమాయకులైన మమ్మల్ని మోసం చేసిన ఇతనిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.

# ఉద్యోగాల సృష్టికర్త - మన చంద్రన్న!

## -శ్రీకాళ హస్తి తెలుగుదేశం పార్టీ నాయకులు



**శ్రీకాళహస్తి ,జూన్ 25 ( ఆంధ్రపత్రిక ):** గత నలభై సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తన కంటూ ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకొని, దేశ సంపదను సరైన రీతిలో వినియోగిం చుకుంటూ మానవ వనరులకు తగిన ఉపాధి అవకాశాలు కలిగేలా చూడటానికి అవసరమైన ఉద్యోగాల సృష్టికర్త మన చంద్రన్న అని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు.మొన్నటి ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మెగా డియస్సీ, పెన్షన్ పెంపు, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ పునరుద్ధరణ, నైపుణ్య గణన అమలు చేయడానికి ప్రమాణస్వీకారం రోజే సంబంధిత ఫైల్ పై సంతకాలు చేసిన ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు ఆదేశాలను మంత్రివర్గం ఆమోదం తెలిపిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, కృతజ్ఞతగా స్థానిక పూసల వీధి కూడలిలో మంగళవారం చంద్రన్న చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

గత ఐదేళ్ల పాలనా కాలంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసి, ఉద్యోగ కల్పనకు కనీస చర్యలు తీసుకోకుండా నిరుద్యోగులను బలవన్మరణాలకు ఉసిగొల్పి పైశాచిక ఆనందాన్ని పొందిన వైయస్ జగన్మోహన్ రెడ్డికి గత ఎన్నికలలో నిరుద్యోగ యువత తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఒక్కటంటే ఒక్క డియస్సీ కూడా వేయకుండా నిరుద్యోగ ఉపాధ్యాయులకు ద్రోహం, పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండిన అన్న క్యాంటిన్ల మూసివేసి పేదల కడుపు కొట్టడం వంటి దుర్మార్గపు చర్యలను చేపట్టిన జగన్మోహన్ రెడ్డి పైశాచిక పాలనను అంతం చేయడంలో భాగస్వాములైన ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్ మిన్నల్ రవి, మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె, బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు సయ్యద్ చాంద్ బాషా, షేక్ రియాజ్, బిసి విభాగం నాయకులు పూల శేఖర్, శివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

సంచలన లేఖ రాశారు. మంత్రుల తర్వాత తనతో ప్రమాణస్వీకారం అసెంబ్లీ పద్ధతులకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లు ఉన్నారని జగన్ అన్నారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని, ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. పార్లమెంటులో కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ ఈ నిబంధన పాటించలేదన్నారు. అధికారకూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శతృత్వాన్ని ప్రదర్శిస్తున్నారని లేఖలో జగన్ పేర్కొన్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ మాట్లాడిన మాటలు వీడియోల ద్వారా బయటపడ్డాయని, ఇలాంటి నేపథ్యంలో అసెంబ్లీలో గొంతు విప్పే పరిస్థితులు కనిపించడంలేదని అన్నారు. ప్రతిపక్ష హోదాతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే అవకాశం ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీ హోదాతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని లేఖను పరిశీలించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడిని జగన్ అభ్యర్థించారు.

# మరి వాలంటీర్ల సంగతేంటి..?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు ప్రభుత్వంలోకి రాగానే వారిని పెన్షన్ల పంపిణీ నుంచి తప్పించడం చర్చ నీయాంశంగా మారింది. అదే సమయంలో వాలంటీర్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం కోరుతూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సంచలనం రేపుతున్నాయి. రాష్ట్రంలో గత ప్రభుత్వం నియమిం చిన వాలంటీర్లలో దాదాపు 60 వేల మందికి పైగా ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత రాజీనామాలు చేసి అధికార వైసీపీకి మద్దతుగా ప్రచారంలోకి వచ్చేశారు. వైసీపీ నేతల ఒత్తిడి తోనే ఆ రాజీనామాలు చేశామని ఇప్పుడు వారు చెప్తున్నారు. గతంలో ఎన్నికల పోలింగ్ సమయానికి దాదాపు లక్ష మంది వాలంటీర్లు ఇలా రాజీనామాలు చేశారు. దీంతో వాలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు ఆమోదించవద్దంటూ హైకోర్టులో పిటి షన్లు దాఖలయ్యాయి. దీనిపై అప్పట్లో విచారణ జరిపిన హైకోర్టు.. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ తాజాగా మరోసారి వాలంటీర్ల రాజీనామాల ఆమోదం వ్యవహారంపై విచారణ జరిపిన హైకోర్టు.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఈసీ తమ అభిప్రాయాలు తెలుపుతూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో ఏం చెప్ప బోతోందన్నది కీలకంగా మారింది. ఎందుకంటే రాష్ట్రంలో ఇప్పటికే రాజీనామాలు చేసిన వాలంటీర్లతో వైసీపీ నేతలపై కేసులు పెట్టిస్తున్న కూటమి సర్కార్.. వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. అదే సమయంలో పెన్షన్ల పంపిణీ నుంచి వారిని తప్పించింది. ఈ నేపథ్యంలో హైకోర్టులో ప్రభుత్వం తన స్టాండ్ చెప్పక తప్పని పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు త్వరలో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయనుంది.

# కష్టపడిన వారికే న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నారు. మంత్రివర్గంలో చోటుదక్కని వారు సైతం పదవుల కోసం చూస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ వేధింపులు తట్టుకొని ప్రజల తరఫున పోరాటాలు చేస్తూ పార్టీకి అండగా ఉన్న వాళ్లకే ఈసారి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని స్పష్టం చేశారు. దీని కోసం ప్రత్యేక విధానం ద్వారా క్షేత్రస్థాయి రిపోర్టు తెప్పించుకుంటున్నానని తెలిపారు. వివరాలు వచ్చిన తర్వాత మరోసారి వడపోసి ఇంకా మిస్ అయిన వాళ్లు ఉంటే వారికి న్యాయం చేసేలా ఈ భర్తీ పక్రియ ఉంటుందని అన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు,పార్టీలోని ఇతర ముఖ్య నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన చంద్రబాబు కీలక అంశాలు ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారంతో విర్రవీగి టీడీపీ నేతలను హింసించిన ఇబ్బంది పెట్టిన వారికి ఎంట్రీ లేదన్నారు చంద్రబాబు. అలాంటి వాటిని పార్టీలో చేర్చుకోబోమని స్పష్టం చేశారు. ప్రతి శని వారం పార్టీ నాయకుల సమస్యలను తానే స్వయంగా వింటానని వారి నుంచి వినతి పత్రాలు తీసు కుంటానని వెల్లడించారు. ఐదేళ్ల పాటు పోరాటం ఒక ఎత్తు అయితే పొత్తులో భాగంగా సీట్లు లేకపో యినా కూటమిక కోసం చాలా మంది నేతలు శ్రమించారని వారిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు చంద్రబాబు. అలాంటి వారి వల్లే ఇంతటి ఘన విజయం సాధించగలిగామని గెలిచిన వారంతా గుర్తు పెట్టుకోవాలని సూచించారు. గ్రామస్థాయి శ్రేణులంతా పార్టీ ఎలాంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా అప్పటి వేధింపులను ఎదుర్కొని విజయవంతం చేశారని కితాబు ఇచ్చారు. అలాంటి పోరాటాలు చేసిన వారికి ఈసారి కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు చంద్రబాబు. వివిధ మార్గాల్లో పార్టీ విజయానికి నిజాయితీగా కష్టపడే వాళ్ల వివరాలు తెలుసుకుంటున్నట్టు తెలిపారు.

# పరీక్ష నిర్వహణలో కేంద్రం విఫలం..

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పరీక్ష నిర్వహణలో కేంద్రం విఫలం అయిందని మండిపడ్డారు. సీబీఐ విచారణ సరిపోదని చెప్పారు. కోట్లాదిమంది విద్యా ర్థుల భవితవ్యానికి సంబంధించిన అంశం, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రధాని మోదీ మౌనం వహించడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మరోవైపు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధికారికంగా కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో పోచారం శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆహ్వానించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని పార్టీ కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారు. ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు పోచారం శ్రీనివాస్ రెడ్డిని రేవంత్ రెడ్డి పరిచయం చేశారు. అలాగే ఏఐసీసీ అగ్రనేతలతో రేవంత్ సమావేశం కానున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ అధ్యక్ష ఎంపిక, తదితర కీలక అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం హైదరాబాద్ తిరిగి రానున్నారని సమాచారం.తన రాజకీయ జన్మ మొదలైంది కాంగ్రె స్‌తోనే, చివరకు ముగిసేది కాంగ్రెస్‌లోనే అని ఎమ్మెల్యే పోచారం ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరా, పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో పనిచేశానని అన్నారు. కాంగ్రెస్‌లో తిరిగి చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆరునెలలుగా పరిపాలనను గమ నిస్తున్నా, అంకితభావంతో రేవంత్ నడుపుతున్నారని వివరించారు. రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. రైతులకు మంచి జరగాలనే రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ తాను, తన అనుచరులు మొత్తం కాంగ్రెస్‌లో చేరారు అని పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే మంత్రివర్గ విస్తరణలో పోచారంకు స్థానం ఉందంటూ ప్రచారం సాగుతోంది.

# శాసనసభ వ్యవహారాలపై అవగాహన అవసరం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. శాసనసభ వ్యవహారాలపై వారికి అవగాహన కల్పించారు. సభ నియమావళికి తెలియజేశారు. మరోవైపు డిప్యూటీ సీఎం నేటి నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపట్టారు. 11 రోజుల పాటు నిర్వహించే ఈ దీక్షలో భాగంగా పండ్లు, ద్రవాహారం మాత్రమే తీసుకుంటారు.

# 15 రోజుల్లోగా వివరణ కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రసాద్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జగన్ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్.. పోలవరం నిర్వాసితుల పునరావాసం విషయంపై అప్పట్లోనే జగన్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి తీసుకున్న చర్యలపై వివరణ ఇవ్వాలంటూ ప్రస్తుత సీఎస్‌ను కమిషన్ ఆదేశించింది. నోటీసులు అందుకున్న 15రోజుల్లోగా తమ ఎదుట హాజరై పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొంది.

# త్వరలోనే మళ్లీ టెట్..

**విజయవాడ,జూన్ 25 (ఆంధ్రపత్రిక):** ఏపీ టెట్ ఫలితాలను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ పరీక్షల్లో క్వాలిఫై అయిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. మెగా డీఎస్సీకి టెట్ అర్హత, 20 శాతం వెయిటేజీ ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా 2.35 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఎంతో ఆతృతగా ఈ ఫలితాల కోసం ఎదురు చూశారని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ టెట్లో అర్హత సాధించని వారు నిరాశకు గురికావొద్దని 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. వీరంతా.. కొత్తగా బీఈడీ, డీఎడ్ పాసైన అభ్యర్థులతో పాటు అతి త్వరలోనే నిర్వహించబోయే టెట్కు, మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని లోకేశ్ సూచించారు.

# భారత్ మరింత ప్రకాశించాలి

(మొదటిపేజీ తరువాయి)



ప్రయోజనాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. వీరిద్దరి భేటీపై మోడీ ట్వీట్ చేశారు. తాను వెంకయ్య నాయుడును కలిశానని, ఆయనతో దశాబ్దాలుగా పని చేసే అవకాశం లభించిందని వ్యాఖ్యానించారు. భారతదేశ పురోగతి పట్ల ఆయన వివేకం, అభిరుచిని ఎప్పుడూ ప్రశంసించానని అన్నారు. అలాగే మోడీ తన నివాసానికి వచ్చి కలిశారని, భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోడీకి ఈ సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాని వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సందర్భంగా మా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాము. నరేంద్ర మోడీ నాయకత్వంలో రాబోయే సంవత్సరాలలో భారత్ మరింత ప్రకాశిస్తుందని, సరి కొత్త శిఖరాలకు చేరుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

# కుప్పంపై బాబు హామీల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అందులో భాగంగా ఒక్కో గ్రామానికి రూ. 10కోట్లు అభివృద్ధి నిధి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికలు ఎంతో చారిత్రాత్మకం అని వివరించారు. రాబోయే ఐదేళ్లలో కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. కేబినెట్లో కొత్తవారికి ఎక్కువగా అవకాశం ఇచ్చామన్నారు. అలాగే 8మంది బీసీలకు కేబినెట్లో చోటు కల్పించామని చెప్పారు. కుప్పంలో హంద్రీనీవా నీటితో చెరువులన్నీ నింపుతామన్నారు. వైసీపీకి కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. త్వరలోనే కుప్పంకు విమానాశ్రయం తీసుకువస్తామన్నారు. అంతకుముందు శాంతిపురం మండలం చిన్నారి దొడ్డి, జల్లిగాని పల్లి దగ్గర హంద్రీ నీవా కాలువ పనులు



చంద్రబాబు పరిశీలించారు. హంద్రీ నీవా కాలువ స్థితిగతులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. ఇంకా చేపట్టాల్సిన పనులు, పూర్తి కావాల్సిన పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం మండలం శివపురంలో తన సొంత ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు చంద్రబాబు. 2 ఏళ్ల క్రితం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. 2.1 ఎకరాల స్థలంలో ఈ ఇంటి నిర్మాణం కొనసాగుతోంది. నిర్మాణ పనులపై కాంట్రాక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఏపీ సీఎం. ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిననంతరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో పార్టీ నేతలతో సమావేశం అవుతారు సీఎం చంద్రబాబు. అనంతరం ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళనున్నారు.

# నేడు స్పీకర్ ఎన్నికకు ఓటింగ్

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఇండియా కూటమి సై అంటోంది. లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, ఎన్డీయే కూటమికి విపక్ష కాంగ్రెస్ భారీ షాక్ ఇచ్చింది. సంఖ్యా బలం తక్కువున్నా.. కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది. ఈ మేరకు కేరళ నుంచి 8సార్లు ఎంపీగా గెలుపొందిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి అప్పగించాలన్న సంప్రదాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని రాహుల్ ఆరోపించారు. ఇకపోతే సీనియార్టీ ప్రకారం సురేష్ ప్రోటెం స్పీకర్ కావాల్సి ఉన్నా, అధికార ఎన్‌డిఏ కూటమి ఒడిషాకు చెందిన మరో సీనియర్ భర్తృహరిని ఎంపిక చేసింది. ఈ నిర్ణయంపై ఇండియా కూటమి ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో కనీసం డప్యూటి స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. డిప్యూటి పదవిని తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే సయోధ్య కుదరకపోవడంతో దేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటికి వరకు జరిగిన లోక్‌సభ స్పీకర్ పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కాగా 75 ఏళ్ళ దేశ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం ఇదే తొలిసారి కానుంది. తొలుత స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం అవుతుందని భావించారు. కానీ స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మెలిక పెట్టింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి సభ్యులతో జరిపిన చర్చల్లో.. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇస్తే స్పీకర్‌కి మద్దతు తెలుపుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి దాదాపు అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, కాంగ్రెస్ అనూహ్యంగా అభ్యర్థిని పోటీలో నిలిపింది. దీంతో స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఏ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల పక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది.18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు.స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే పక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.

# లోక్‌సభలో తెలుగు ఎంపిల ప్రమాణం

- అసదుద్దీన్ పాలస్తీనా నినాదాలు
- మండిపడ్డ లోక్‌సభ ఎంపిలు
- రికార్డుల్లో తొలగిస్తామన్న ప్యానల్ స్పీకర్

**న్యూఢిల్లీ,జూన్ 25 :** పార్లమెంట్‌లో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోమవారం నాడు కొందరు ఎంపీలు లోక్‌సభలో ప్రమాణం చేశారు. మంగళవారం సైతం ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం కొనసాగించారు. ఈ క్రమంలో ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం దుమారం రేపింది. అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే అసదుద్దీన్ ఒవైసీ వివాదాస్పద నినాదాలు చేశారు. ప్రమాణం పూర్తి చేస్తూ చివర్లో జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అని అసదుద్దీన్ నినాదాలు చేశారు. అసదుద్దీన్ జై పాలస్తీనా అనడంపై అధికార పక్ష నేతలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ పై యుద్ధంలో హమాస్ తో ఆశ్రయం ఇచ్చిన పాలస్తీనాకు భారత ఎంపీ ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఆ పదాలను రికార్డ్స్ నుంచి తొలగిస్తామని చెప్పారు. ఎవరైనా వివాదాస్పద నినాదాలు చేస్తే వాటిని రికార్డ్స్ నుంచి తొలగిస్తారు. అసదుద్దీన్ వాడిన వివాదాస్పద పదాల్ని లోక్ సభ రికార్డ్స్ లో నుంచి తొలగించే అవకాశం ఉంది.ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, ధర్మపురి అరవింద్, రఘునందనరావు, కొండా విశ్వేశ్వరరెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు. ఇక సురేశ్ షెట్కర్, ఈటల రాజేందర్, డీకే అరుణ, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ఇక హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఉర్దూలో ప్రమాణం చేశారు. జై సమ్మక్క సారలమ్మ అని ఈటల రాజేందర్ నినాదం చేసారు. . జై లక్ష్మీ నర్సింహ స్వామి అని నినదించిన కిరణ్‌కుమార్ రెడ్డి. జై భద్రకాళి అని నినాదం చేసిన కడియం కావ్య. . జై తుల్జా భవాని అన్న బలరాం నాయక్,. జై భీం అని నినదించిన ఎంపీలు మల్లురవి, కావ్య, రఘు రాంరెడ్డి. కాగా నిబంధనలు పరిశీలించి... రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తానని సభాపతి స్థానంలో రాధామోహన్ సింగ్ సభ్యులకు సర్దిచెప్పారు.

# రాయితీపై సబ్సిడీ విత్తనాలు పంపిణీ

**విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**

**పెదన,జూన్ 25 (ఆంధ్రపత్రిక):** ఈ సీజన్లో రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన ఇన్పుట్ సబ్సిడీ పంపిణీలో అక్రమాలు తప్పిదాలను తిరిగి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధ్యులను నిర్ధారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుడిసేవ రామారావు మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ పరసా రాంబాబు చెన్నూరు శేఖర్ బొడ్డు చినబాబు



గంధం గోపాలకృష్ణ పంద్రాజు హరిబాబు పంద్రాజు లక్ష్మణరావు సొంటి రాము పరసా చిన్నా కన్నె పోటీ సాయి కిరణ్ అనగాని అంకాలరావు, జనసేన మండల అధ్యక్షులు ఉచా వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షను రద్దుచేయాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

సమగ్ర నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోదీకి లేఖ రాశారు. నీట్‌ను తొలగించి, ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులను ఎంపిక చేసే స్వేచ్ఛను రాష్ట్రాలను అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధానిని కోరారు. తక్షణమే పాత పద్ధతిని పునరుద్ధరించాలని ప్రధానమంత్రిని కోరారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాలకు సంబంధించి ఇరు దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనా మధ్య జరిగిన చర్చలకు కేంద్రం తనను ఆహ్వానించక పోవడంపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ప్రమేయం లేకుండా ఇరు దేశాలు నీటి పంపకాలపై చర్చలు జరపడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోదీకి లేఖ రాశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా, అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చర్చలు, సంప్రదింపులు జరపడం ఆమోదయోగ్యం కాదు' అని మమత పేర్కొన్నారు. తీస్తా నదీ జలాల పరిరక్షణ-నిర్వహణ, 1996 నాటి గంగా జలాల ఒప్పందం పునరుద్ధరణ అంశాలపై ఇటీవల మోదీ, హసీనా చర్చలు జరిపారు. అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో సాంకేతిక బృందాన్ని బంగ్లాదేశ్కు పంపనున్నట్టు తెలిపారు. ఒప్పందం ప్రకారం తీస్తా జలాల పరిరక్షణ, నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద రిజర్వాయర్ను నిర్మించడానికి భారత్ సిద్ధంగా ఉంది. అయితే భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాల ఒప్పందాన్ని చాలాకాలంగా మమత వ్యతిరేకిస్తున్నారు.

# కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరందాలి..

(మొదటిపేజీ తరువాయి)

వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురు కాకూడదన్నారు. అన్నదాతకు మేలు జరిగేలా కాలువలు, డ్రైన్లలో అవసరమైన ప్రక్షాళన పనులను యుద్ధ ప్రాతిపదికన పదిరోజుల్లో మొదలు పెట్టేలా సమాయత్తం కావాల న్నారు. సచివాలయంలో మంగళవారం మంత్రి తన ఛాంబర్ లో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, సలహాదారులు ఎం.వెంకటేశ్వర రావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణ రెడ్డి లతో కలిసి శాఖకు సంబంధించిన ఉన్నత ఇంజనీరింగ్ అధికారులు, అన్ని జిల్లాల ఎస్ ఇ. లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టులు, కాలువలు, డ్రైన్లు, ఏటిగట్లు వంటి పనులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి అన్నారు. ఆనాడు ఎన్టీ రామారావు, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిపాలన సాగించా రన్నారు. ఆ ఉద్దేశంతోనే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రైతాంగానికి మేలు జరగాలనే ఉద్దేశంతో బడ్జెట్ ఇబ్బందులు ఉన్నా ప్రత్యేక నిధులు ఇచ్చేందుకు సుముఖత తెలిపారన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎటువంటి కష్ట నష్టాలు ఎదురుకాకుండా పంట కాలువలు, మురుగు, డ్రైన్ల లో ప్రక్షాళన పనులు పది రోజుల్లోగా చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రధానంగా తూడు, గుర్రపు డెక్క, మట్టి తొలగింపు పనులు చేపట్టాలన్నారు. కాలువలు, డ్రైన్ల లో లాకులు, అవుట్ స్లూయిస్, షట్టర్ తలుపుల మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. ఈ ఏడాది ఈ పనులు చేపట్టా లంటే ఏప్రిల్ నాటికి ప్రతిపాదనలు, మే నెలలో టెండర్లు ఖరారు వంటివి జరిగితే వేసవి లో పనులు జరిగి ఉండేవని, వీటిపై ఎందుకు దృష్టి పెట్టలేదని అధికారులను మంత్రి ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చిన్నపాటి వర్షానికి వేలాది ఎకరాల పంట పొలాలు ముంపుకు గురై రైతాంగం ఆర్థికంగా నష్టపోయిం దన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో గోదావరి ఏటి గట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఏటి గట్లు బలహీన ప్రాంతాల్లో అవసరమైన సామాగ్రిని సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో పోలవరం తోపాటు ఇతర ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన విధ్వంసానికి గురయ్యాయి అన్నారు. ప్రధానంగా అన్నమయ్య, ఫించా, గండ్లకమ్మ, పులిచింతల ప్రాజెక్టులను పట్టించుకోక పోవడంతో అవి ధ్వంసమైన విషయం తెలిసిందే అన్నారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టుల వద్ద, రిజర్వాయర్ వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. నదుల అనుసంధానం ద్వారా కరువు రహిత రాష్ట్రంగా సస్య శ్యామలమయ్యే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు.

# రాహుల్ డిప్యూటి ప్రతిపాదనలపై చర్చ

**న్యూఢిల్లీ,జూన్ 25 :** లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఓం బిర్లా ఏకగ్రీవంగా ఎన్నికవుతారని అంతా భావించారు. కానీ ప్రతి పక్ష కాంగ్రెస్ పార్టీ తమ స్పీకర్ అభ్యర్థిగా కె.సురే శ్‌ను బరిలో దింపింది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఆ పద వికి రేపు ఎన్నిక జరగనుంది. అయితే లోక్‌సభ స్పీకర్ పదవి మీరు తీసుకోండి.. డిప్యూటీ స్పీకర్ పదవి మాత్రం ప్రతిపక్షానికి కేటాయించి పాత సంప్రదాయాన్ని కొనసాగించడంటూ బీజేపీ పెద్దల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపాదన చేశారు. రాహుల్ చెబుతున్న ఈ పాత సంప్రదాయంపై రాజకీయ వర్గాల్లో ఓ ఆసక్తికర చర్చ అయితే వాడి వేడిగా నడుస్తుంది. దీనిపై కొందరు అధికార పార్టీ ఎంపిలు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పాలిత లేదా ఇండియా కూటమి పాలిత రాష్ట్రాల్లో ఈ సంప్రదాయం ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే బీజేపీ పెద్దల ముందు రాహుల్ గాంధీ పెట్టిన ఈ 'సంప్రదాయం' ఇండియా కూట మిలోని భాగస్వామ్య పక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రంలో కానరావడం లేదనే ఓ చర్చ వైరలవుతుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, కేరళ అసెంబ్లీలలో అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లుగా కొనసాగుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలు తెలంగాణ, ఝార్ఖండ్‌లలో స్పీకర్‌గా ఆ పార్టీ వారే ఎన్నికయ్యారు. మరోవైపు ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్లు లేక పోవడం గమనార్హం. అలాగే పంజాబ్, ఢిల్లీలలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీలలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు అధికార పార్టీకి చెందిన వారేనన్న విషయం అందరికీ తెలిసిందే. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో సైతం స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు హస్తం పార్టీకి చెందిన వారే కొనసాగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెబుతున్న పాత సంప్రదాయం 'ఇండియా కూటమి' ఎలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా లేదనే ఓ చర్చ సైతం హాట్ హాట్‌గా కొనసాగుతుంది.

# అయోధ్య గర్భగుడిలో లీకేజీ నిజమే

**అయోధ్య,జూన్ 25 :** అయోధ్య రామమందిరం గర్భగుడిలోకి పైకప్పు నుంచి నీరు కారుతున్నట్టు.. ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ వెల్లడించిన క్రమంలో దీనిపై ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర స్పందించారు. లీకేజీ నిజమేనని అంగీకరించిన ఆయన..దీనికి డిజైన్ సమస్యలు కారణం కాదని వెల్లడించారు. ప్రస్తుతం నేను అయోధ్యలోనే ఉన్నాను. మొదటి అంతస్తు నుంచి వర్షం నీరు కారడాన్ని చూశాను. గురుమండపం నుంచి ఆకాశం కనిపిస్తుంది. శిఖర నిర్మాణం పూర్తయితే అది కవర్ అవుతుంది. ప్రస్తుతం మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో పురోగతి ఉంది. ఒకసారి ఆ పనులు పూర్తయితే అక్కడి పైపులు అన్ని మూసివేస్తాం. అలాగే గర్భగుడిలో ఎలాంటి డ్రైనేజీ తరహా నిర్మాణం లేదు' అని వెల్లడించారు. మొత్తం ఆలయ నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని తెలిపారు.

# రాజ్యాంగ ప్రతులతో విపక్ష ఎంపిల ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయించారు. రెండోరోజైన మంగళవారం కూడా మిగిలిన ఎంపీలు ప్రమాణం చేసారు. అయితే, ఈ సమావేశాల్లో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటెం స్పీకర్ నియమించిన తీరుకు వ్యతిరేకంగా సమావేశాలు ప్రారంభం నుంచి విపక్ష కూటమి పార్టీల ఎంపీలంతా రాజ్యాంగ ప్రతులతో సభలో నిరసన తెలుపుతున్నారు. అదేవిధంగా రాజ్యాంగ ప్రతులతోనే ప్రమాణ స్వీకారం కూడా చేస్తున్నారు. పోడియం వద్దకు వెళ్లి ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా కూటమి పార్టీల ఎంపీలంతా ఇదే విధానాన్ని ఫాలో అవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కూడా రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణం చేశారు.

# బిజెపిలోకి పెద్దిరెడ్డి..?

(మొదటిపేజీ తరువాయి)

నరసింహారావు, ప్రస్తుత కేంద్ర మంత్రి నరసాపురం ఎంపీ శ్రీనివాస్ వర్మ. ఏమి జరుగుతుందో చూడాలి మరి.






మంగళగిరి పార్టీ కార్యాలయంలో
ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేష్

# పోషక ఆహార లోపం తలెత్తకుండా పటిష్టమైన చర్యలు

**గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం**

**వారికోసం అందుబాటులోకి ఏఎన్ఎమ్‌ల సేవలు**

**గిరిజన మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి**

**అమరావతి, జూన్ 25 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 554 గిరిజన పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కు ఏఎన్ఎమ్‌ల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రాష్ట్ర గిరిజన మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. గిరిజన పాఠశాలల్లో అనారోగ్యం, పోషక ఆహార లోపం సమస్యలు తలెత్తకుండా, తద్వారా విద్యార్థుల మరణాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించిన తదుపరి పబ్లిసిటీ సెల్లో పాత్రికేయులతో మాట్లాడుతూ గిరిజనుల సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తొమ్మిది ఐ.టి.డి.ఏ.ల పరిధిలోని 554 గిరిజన పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకై ఏఎన్ఎమ్‌లను డిప్యూట్ చేయడమే కాకుండా ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గిరిజన గిరిజన పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో విద్యార్థుల స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా ఉండేందుకై త్వరలో నిర్వహించనున్న మెగా డిఎస్సీ ద్వారా 2,024 ఉపాధ్యాయులను గిరిజన పాఠశాలల్లో భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రత్యేకించి గిరిజన విద్యార్థినులు విద్యనభ్యసించే గిరిజన బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించడం జరుగుతుందని, అంటెండర్లుగా కూడా మహిళలనే నియమించడం జరుగుతుందన్నారు. విద్యా భోధన, ఆహారం, భద్రత తదితర అంశాలపై ఫిర్యాదు చేసుకునేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేస్తామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచడమే కాకుండా ఇతర అధికారులతో ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపించి తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లీబిడ్డా ఎక్స్ ప్రెస్ సేవలను పునరుద్ధరిస్తామని, ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలను క్షేమంగా వారి ఇళ్లకు చేరుస్తామన్నారు. వాహనాల ద్వారా రేషన్‌ను ఇంటి వద్దే పంపిణీ చేసే విధానం వల్ల గిరిజనులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవడం జరుగుచున్నదని, ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో 962 రేషన్ డిపోలు ఉన్నాయని, ఆ డిపోల ద్వారానే రేషన్ పంపిణీ చేసే విధానాన్ని అనుమతించే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. జిసిసి పరిధిలో 16 పెట్రోల్ బంకులు, 12 గ్యాస్ డిపోలు మరియు 12 సూపర్ మార్కెట్లు ఉన్నాయని వాటిని అభివృద్ధి పరుస్తామన్నారు. అరుకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని, దేశ, విదేశాల్లో అరుకు కాఫీ విక్రయాలను విస్తరింపచేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మాధక ద్రవ్యాల నిర్మూలన విషయంలో జిసిసి, పోలీస్, విజిలెన్సు వ్యవస్థలను కూడా అప్రమత్తం చేయనున్నట్లు ఆమె తెలిపారు.





రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును మర్యాద పూర్వకంగా కలిసిన పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా నియమితులైన చదలవాడ నాగరాణి... ప్రస్తుతం సాంకేతిక విద్యా శాఖ కమీషనర్‌గా ఉన్నారు.

# విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

**అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు సూచన**



**అమరావతి,జూన్ 25 (ఆంధ్రపత్రిక):** ఖరీఫ్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చె న్నాయుడు సూచించారు. ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తనపై ఉన్న నమ్మకంతోనే సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ అప్పగించారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఏపీ వ్యవ సాయ శాఖను ఆదర్శ శాఖగా తీర్చిదిద్దుతానని అచ్చెన్న హామీ ఇచ్చారు.




































Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com